జాతీయ తెలుగు దినపత్రిక
# ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం



## భద్రాద్రి కొత్తగూడెం
మంగళవారం | 14 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 9

# బావుంది.... ఇంకొంచెం తినండి

**మాజీ మంత్రి జలగం కు కొసరి కొసరి వడ్డించిన మంత్రి తుమ్మల**



**అశ్వారావుపేట, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి :** మండలంలోని మొద్దులమడ గ్రామంలో ఓ వివాహ శుభకార్యానికి రాష్ట్ర వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, మాజీ మంత్రి జలగం ప్రసాదరావు, స్థానిక శాసనసభ్యులు జారే ఆదినారాయణ మాజీ శాసనసభ్యులు మెచ్చా నాగేశ్వరరావు

మిగతా 2 లో...




# పాడి అభివృద్ధి ఎక్కడ..?


- అధికారుల నిర్లక్ష్యానికి బలి అయిన పాడి పరిశ్రమ!
- విజయ డెయిరి షాప్ పేరిట ఇతర వ్యాపారాలకు అనుమతులు ఎలా..?
- పర్యవేక్షణ లేక నిర్వీర్యమైన విజయ డెయిరి మినీ సీతల కేంద్రం
- ముగ్గురు మంత్రుల దృష్టికి పాడి పరిశ్రమ దుస్థితి ఎప్పుడు చేరుతుంది..?

**కొత్తగూడెం, ఏప్రిల్ 13 (ప్రజాజ్యోతి ):** లక్ష్మీదేవి పల్లి మండలం పాడి పరిశ్రమ అభివృద్ధి లక్ష్యంతో ప్రారంభించిన విజయ డెయిరి మినీ పాల సీతల కేంద్రం ప్రస్తుతం పూర్తిగా నిర్వీర్యంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. గ్రామీణ పాడి రైతులకు అండగా నిలిచి పాల సేకరణను సులభతరం చేయాల్సిన ఈ కేంద్రం తాత్కాలిక నిర్వహణకే పరిమితమై అసలు ఉద్దేశాన్ని కోల్పోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతుల నుంచి పాలను సేకరించి మిషనరి ద్వారా చల్లబరచి పాలకేంద్రం సమక్షంలో డెయిరీలకు పంపే కీలక బాధ్యత ఈ కేంద్రంపై ఉన్నప్పటికీ అది సక్రమంగా అమలు కావడం లేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కేంద్ర పనితీరును తీవ్రంగా దెబ్బతీసిందని చెబుతున్నారు. పాల కేంద్రం లో పని చేసే ఉద్యోగులు సకాలంలో విధులకు హాజరుకాకపోవడం పాల సేకరణలో నిర్లక్ష్యం చూపించడం వంటి కారణాలతో రైతులు ఈ కేంద్రంపై నమ్మకం కోల్పోతున్నారు. దీంతో పాడి రైతులు ఇతర ప్రైవేట్ మార్గాల వైపు మొగ్గు చూపాల్సిన పరిస్థితి

మిగతా 2 లో...

# సెన్సస్ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి

**జిల్లా కలెక్టర్ అంకిత్**



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 13,(ప్రజా జ్యోతి )** సెన్సస్ కు సంబంధించిన పెండింగ్ లో ఉన్న పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సంబంధిత జిల్లా అధికారులను ఆదేశించారు.తెలంగాణ రాష్ట్రంలో సెన్సస్–2027 ఏర్పాట్లపై డీసీఓ భారతి హోళీకేరి సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల కలెక్టర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రత్యేక చార్జ్ లకు సంబంధించిన ప్రతిపాదనలు అన్ని జిల్లాలు సమర్పించాల్సి ఉండగా, కొన్ని జిల్లాలు మాత్రమే వివరాలు అందించాయని, మిగతా జిల్లాలు వెంటనే సమర్పించాలని ఆదేశించారు.ఇళ్ల గణనకు సంబంధించి జిల్లా, మండల స్థాయిలో భూభాగ గణాంకాల్లో ఉన్న వ్యత్యాసాలపై కూడా చర్చించారు. వివిధ వనరుల నుండి వచ్చిన డేటాలో ఒకే డేటాను

మిగతా 2 లో...

# స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు: ఎస్పీ రోహిత్ రాజు

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13 ( ప్రజాజ్యోతి ):** ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా ఎస్పీ రోహిత్ రాజు సూచించారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టడం ట్రాఫిక్ నియమాలపై ప్రజల్లో అవగాహన పెంచడం లక్ష్యంగా పోలీసు శాఖ నిర్వహిస్తున్న Arrive–Alive–2026 కార్యక్రమంలో భాగంగా సోమవారం పాల్వంచ పట్టణంలోని ఎంసీబీటీ ఐటీఐ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా




ఎస్పీ రోహిత్ రాజు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాల్వంచ డీఎస్పీ సతీష్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సుమారు 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా

మిగతా 2 లో...

# భట్టి విక్రమార్క పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారె

**దమ్మపేట,ఏప్రిల్ 13,(ప్రజాజ్యోతి ):** దమ్మపేట మండలంలో ఈ నెల 15వ తేదీ బుధవారం నిర్వహించనున్న నూతన విద్యుత్ సబ్ స్టేషన్ ల శంకుస్థాపన కార్యక్రమం విజయవంతం కోసం ఎమ్మెల్యే శ్రీ జారె ఆదినారాయణ సోమవారం మండల అధికారులతో కలిసి ఏర్పాట్లను సమీక్షించారు.తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ప్రణాళిక– విద్యుత్ శాఖల మంత్రివర్యులు శ్రీ మల్లు భట్టి విక్రమార్క జగ్గారం, మల్లారం గ్రామాలలో నూతన విద్యుత్ సబ్ స్టేషన్ లకు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో



ఎమ్మెల్యే స్థల పరిశీలన నిర్వహించి, కార్యక్రమానికి సంబంధించిన ప్రతి అంశంపై అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా సభా వేదిక నిర్మాణం, ప్రజల కూర్చోవడానికి సదుపాయాలు, తాగునీటి

మిగతా 2 లో...

## బావుంది.... ఇంకొంచెం తినండి



(మొదటి పేజీ తరువాయి... )

ఒకే సమయంలో హాజరై వేదికను పంచుకోవడమే కాకుండా విందులో ఒకే చోట కూర్చుని వారి రాజకీయ అనుభవాలను చర్చించుకున్నారు. ఈ సమయంలో జలగం ప్రసాదరావుకు మంత్రి తుమ్మల అడిగిమరి కొసరి కొసరి వడ్డిస్తూ ఆహ్లాదంగా కనిపించారు. మంత్రి తుమ్మల ఇది మాజీ ముఖ్యమంత్రి జలగం వెంగళరావు నియోజకవర్గమని పెద్దాయన ఆశయాలకు అనుగుణంగా ఇప్పటికీ ఈ నియోజకవర్గ అభివృద్ధికి తమ వంతు సహాయం అందిస్తున్నామని గత స్మృతులను గుర్తు చేసుకున్నారు. ఈ సన్నివేశాన్ని చూసిన నాటి తరం.. నేటితరం రాజకీయ నాయకులు కూడా ఎన్నికల వరకే రాజకీయాలు కానీ అభివృద్ధిలో కాదు అనేలా మంత్రి తుమ్మల,మాజీ మంత్రి జలగం వ్యవహరించారని చర్చించుకున్నారు.

## భట్టి విక్రమార్క పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే జారె



(మొదటి పేజీ తరువాయి... )

ఏర్పాటు, పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా ఏర్పాట్లు, పారిశుద్ధ్యం వంటి అంశాలను సమగ్రంగా పర్యవేక్షించారు. కార్యక్రమానికి పెద్ద ఎత్తున ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే విద్యుత్ సబ్ స్టేషన్ ల నిర్మాణం పూర్తయిన తర్వాత ప్రాంతీయంగా విద్యుత్ సరఫరా మెరుగుపడటంతో పాటు రైతులకు, గృహ వినియోగదారులకు– పరిశ్రమలకు మరింత మేలు కలుగుతుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతం చేయడంలో ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## స్వీయ క్రమశిక్షణతో రోడ్డు ప్రమాదాలను నివారించవచ్చు: ఎస్పీ రోహిత్ రాజు



(మొదటి పేజీ తరువాయి... )

ఎస్పీ మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం, సీట్ బెల్ట్ ప్రాధాన్యత, డిఫెన్సివ్ డ్రైవింగ్ వంటి అంశాలపై విద్యార్థులకు వివరించారు. రోడ్డు భద్రతా నియమాలను పాటించడంలో స్వీయ క్రమశిక్షణ ఉంటే ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని పేర్కొన్నారు. ట్రాఫిక్ పోలీసులు ఉన్నా లేకపోయినా ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించే సివిక్ సెన్స్ కలిగి ఉండాలని సూచించారు. డ్రంక్ అండ్ డ్రైవ్, ర్యాష్ డ్రైవింగ్, మొబైల్ ఫోన్ ఉపయోగిస్తూ వాహనం నడపడం, రాంగ్ రూట్, సిగ్నల్ జంపింగ్, ఓవర్ లోడింగ్ వంటి కారణాలతో ప్రమాదాలు సంభవిస్తాయని వివరించారు. తమ ప్రాణ భద్రతతో పాటు ఇతరుల భద్రత కోసం కూడా ట్రాఫిక్ నియమాలను గౌరవించాలని విజ్ఞప్తి చేశారు. విద్యార్థి దశలో క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలని తల్లిదండ్రుల ఆశయాలను నెరవేర్చాలని సూచించారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్ సుజాత, ఆర్టీఓ వెంకటరమణ, కార్పొరేటర్ నూకల సరిత, మెడికల్ ఆఫీసర్ రామ్ ప్రసాద్, ఎన్ హెచ్ఏఐ జేఈ మోహమ్మద్ అలీ, ఎస్ బీ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్, సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

# పాడి అభివృద్ధి ఎక్కడ..?





(మొదటి పేజీ తరువాయి... )

ఈ ప్రాంతంలో ఏర్పడింది. పాల నాణ్యత పరిరక్షణ, రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం గ్రామీణ ఉపాధి అవకాశాలు కల్పించడం వంటి ముఖ్య ఉద్దేశాలు కాగితాలకే పరిమితమయ్యాయని స్థానికులు విమర్శిస్తున్నారు. లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ప్రస్తుతం ఉపయోగం లేకుండా మారిందని ఆవేదన వ్యక్తమవుతోంది. మొత్తానికి పాడి పరిశ్రమ అభివృద్ధికి కీలకంగా నిలవాల్సిన ఈ పాలకేంద్రం నిర్లక్ష్యం కారణంగా రైతులకు భారంగా మారిందని వెంటనే ఉన్నతాధికారులు స్పందించి కేంద్రాన్ని పూర్తి స్థాయిలో పునరుద్ధరించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**››› సీతల కేంద్రం స్థలంలో ఇతర వ్యాపారాలకు అనుమతులు కేటాయించిదెవరు..?**

విజయ డెయిరి పాల అమ్మకాల కేంద్రం పేరిట కేటాయించిన స్థలాన్ని అక్రమంగా ఇతర వ్యాపారాలకు వినియోగిస్తున్నారనే ఆరోపణలు తీవ్రంగా వినిపిస్తున్నాయి. పాల విక్రయాలు జరగాల్సిన ప్రదేశంలో టీ హోటల్ నిర్వహిస్తూ సిగరెట్లు, పాన్ వంటి వస్తువుల విక్రయాలు జరుగుతున్నట్లు స్థానికులు చెబుతున్నారు. రైతులకు ఉపయోగపడాల్సిన ప్రదేశాన్ని అద్దెలకు ఇచ్చి ఇతర వస్తువుల విక్రయాలకు వేదికగా మార్చారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. భారీ స్థాయిలో వ్యాపారాలు కొనసాగుతున్నప్పటికీ సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఇలాంటి అక్రమ కార్యకలాపాలకు అనుమతులు ఎవరు ఇచ్చారన్నది స్పష్టత లేకపోవడం అధికారుల పాత్రపై అనుమానాలకు తావిస్తోంది. పాడి పరిశ్రమ అభివృద్ధికి తోడ్పడాల్సిన కేంద్రం ఇలా దారి తప్పడం బాధాకరమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ధోరణి ఇలానే ఉంటే మున్ముందు సీతల కేంద్రం కొరకు కేటాయించిన స్థలం కబ్జాలకు గురౌతుందని స్థానిక ప్రజలు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి అక్రమాలను అరికట్టి అసలు లక్ష్యానికి అనుగుణంగా పాల కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## దమ్మపేటలో 'అరైవ్ అలైవ్' కార్యక్రమం – రోడ్డు భద్రత వారోత్సవాలకు శ్రీకారం




**దమ్మపేట, ఏప్రిల్ 13,(ప్రజాజ్యోతి):** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న 99 రోజుల "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమంలో భాగంగా దమ్మపేట మండలంలో రోడ్డు భద్రత వారోత్సవాలను సోమవారం ఘనంగా ప్రారంభించారు. "అరైవ్ అలైవ్" కార్యక్రమం కింద వారం రోజుల పాటు మండల పరిధిలోని అన్ని గ్రామ పంచాయతీలలో విలేజ్ రోడ్ సేఫ్టీ కమిటీలను ఏర్పాటు చేసి, పోలీసుల పర్యవేక్షణలో రోడ్డు భద్రతపై విస్తృత చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామాల్లో రహదారుల ఇరువైపులా ఉన్న చెట్లు, పొదలను తొలగించడం, గుంతలను పూడ్చడం, రోడ్డు ప్రమాణాలు పాటించేలా ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ప్రజలు రహదారి భద్రత నియమాలను తప్పనిసరిగా పాటించాలని పోలీసు అధికారులు సూచించారు. అలాగే మండల కేంద్రంలోని అర్బన్ కాలనీ జంక్షన్ వద్ద సర్పంచ్ పగడాల రమాదేవి రాంబాబు అధ్యక్షతన ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దమ్మపేట ఎస్సై సాయి కిషోర్ రెడ్డి, అదనపు ఎస్ఐ బాలస్వామినాథం, పంచాయతీ కార్యదర్శి బండి అనంత కుమార్ ,పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎస్సై సాయి కిషోర్ రెడ్డి మాట్లాడుతూ రోడ్లపై ఆక్రమణలు చేయకుండా వ్యాపారస్తులు సహకరించాలని, డ్రైన్లపై నిర్మించిన షాపులు, హోర్డింగులు, షెడ్డులు తొలగించాలని సూచించారు. ఇప్పటికే పంచాయతీ కార్యాలయం నుంచి నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. సర్పంచ్ పగడాల రమాదేవి మాట్లాడుతూ, రోడ్డు ప్రమాదాలను అరికట్టేందుకు ఈ కార్యక్రమాన్ని ఈ నెల 18వ తేదీ వరకు కొనసాగిస్తామని తెలిపారు. ప్రజలందరి భాగస్వామ్యంతోనే ప్రమాదాలను తగ్గించగలమని, ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతపై బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. పంచాయతీ కార్యదర్శి అనంత కుమార్ మాట్లాడుతూ ప్రమాదాలకు గురయ్యే ప్రదేశాలను గుర్తించి నివారణ చర్యలు చేపడతామని, రోడ్డు ప్రక్కల ఉన్న పిచ్చి చెట్లను తొలగించడం, ఆక్రమణలు నివారించడం వంటి పనులు ఇతర శాఖల సమన్వయంతో కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ అంగోతు శ్రీనివాసరావు, వార్డు సభ్యులు పానుగంటి లక్ష్మణ్ గౌడ్, దారా రాము, బత్తుల సాయి, పూనెం పోలమ్మతో పాటు గ్రామస్తులు మిట్టపల్లి సురేష్, సత్యనారాయణ, బొల్ల మోహన్, కడార్ల శ్రీనివాసచారి, బసవయ్య, సత్తి అమ్మిరెడ్డి పాల్గొన్నారు.

## సెన్సస్ పనులను నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలి



(మొదటి పేజీ తరువాయి... )

ఖరారు చేసి, జిల్లా సెన్సస్ అధికారి ద్వారా ధృవీకరించి పంపించాలని సూచించారు. ఇతర మార్గాల ద్వారా పంపిన సమాచారాన్ని పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు.ఎన్యూమరేటర్ల మాన్యువల్స్, సూపర్వైజర్ కిట్స్, మ్యాప్స్ వంటి సెన్సస్ సామగ్రి పంపిణీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. చార్జ్ అధికారులకు నేరుగా పంపబడే ఈ సామగ్రిని స్వీకరించి, పరిమాణాన్ని ధృవీకరించాలని సూచించారు. అలాగే ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి, వంద శాతం లక్ష్యంతో పాటు అదనపు రిజర్వ్ సిబ్బందిని కూడా సిద్ధంగా ఉంచాలని ఆదేశించారు.సెన్సస్–2027 కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి, నిర్ణీత గడువులో పనులు పూర్తి చేయాలని డీసీఓ స్పష్టం చేశారు.ఈ సందర్భంగా ఐడీఓసీ క్యాంపు కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ, జిల్లాలో సెన్సస్ ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఇప్పటికే విస్తృత స్థాయిలో ప్రణాళికలు రూపొందించామని తెలిపారు. సెన్సస్ కు సంబంధించిన ప్రతి దశను సమయపాలనతో అమలు చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని, సంబంధిత శాఖల మధ్య సమన్వయం కల్పిస్తూ పనులు వేగవంతం చేస్తున్నామని చెప్పారు.ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామక ప్రక్రియను పూర్తి చేసి, వారికి సమగ్ర శిక్షణ అందించేందుకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఫీల్డ్ స్థాయిలో ఎలాంటి లోపాలు లేకుండా ముందస్తుగా పర్యవేక్షణ చేపడుతున్నామని, అవసరమైన అన్ని సౌకర్యాలు అందుబాటులో ఉంచుతున్నామని తెలిపారు .సెన్సస్ కార్యక్రమం విజయవంతంగా నిర్వహించేందుకు ప్రతి అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని, డేటా ఖచ్చితత్వంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు.ఈ సమావేశంలో సీపీఓ సంజీవరావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్ర ర్యాంకులతో నలంద విద్యార్థుల సత్తా

- ఇంటర్ ఫలితాల్లో అగ్రస్థానంలో జూనియర్ కాలేజీ

**లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 13 ( ప్రజాజ్యోతి )**

ఇంటర్మీడియట్ ఫలితాల్లో కొత్తగూడెం నలంద జూనియర్ కాలేజీ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ర్యాంకులు సాధించి సత్తా చాటారు. ఈ ఏడాది అత్యధిక ర్యాంకులు సాధించడం విశేషమని యాజమాన్యం పేర్కొంది. జూనియర్ ఎంపీసీ విభాగంలో పి. చరణ్ 469/470 మార్కులతో రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలిచారు. ఉజ్వల్ అభినవ్ సాయి 468 మార్కు లు సాధించగా, హారిక భరణి, హర్షిని, జస్వింత రోజ్ 467 మార్కులతో జిల్లాలో అగ్రగాములుగా నిలిచారు. మరో 30 మంది విద్యార్థులు 460 పైగా మార్కులు సాధించడం గమనార్హం. బైపీసీ విభాగంలో సాధనాల శ్రీ లక్ష్మి మౌనిక 436/440 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు సాధించింది. రేఖ శ్రీ 435 మార్కులు, చరిష్మా, మహీన్ తన్విన్ 434మార్కులతో ప్రతిభ చాటారు. ఈ విభాగంలో 17 మంది 420 పైగా మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో జి. ఊర్మిళ 493/500 మార్కులతో రాష్ట్ర స్థాయిలో మెరిసారు. సాయి మితిల, అక్షయ్ 483 మార్కులు సాధించగా, సీఈసీ విభాగంలో కౌశిక్ 489 మార్కులతో జిల్లాలో అగ్రస్థానంలో నిలిచారు.






### ద్వితీయ సంవత్సరంలోనూ జోరు

ద్వితీయ సంవత్సర ఫలితాల్లోనూ నలంద విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ విభాగంలో ప్రవళిక 994/1000 మార్కులతో రాష్ట్ర ర్యాంకు సాధించింది. నాగరాజు 993 మార్కులు, పవన్ శంకర్, హన్సిక 990 మార్కులు సాధించారు. బైపీసీ విభాగంలో వినీలా 990 మార్కులు సాధించగా, మైత్రి, రూప, సహస్ర 986 మార్కులు సాధించారు. ఎంఈసీ విభాగంలో రంగలహరి 976 మార్కులు, సీఈసీ విభాగంలో కుషిత 964 మార్కులు సాధించారు. విద్యార్థులను కాలేజీ చైర్మన్ వెంకట చౌదరి, సీఈఓ చైతన్య కృష్ణ, ప్రిన్సిపాల్ మల్లికార్జునరావు, ఏవో రమేష్ ప్రత్యేకంగా అభినందించారు.

## ఇంటర్ ఫలితాల్లో కృష్ణవేణి విద్యార్థుల సత్తా

- ఎంపీసీ, బైపీసీ విభాగాల్లో అగ్రస్థానాలు



**లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 13 ( ప్రజాజ్యోతి )** ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో కృష్ణవేణి విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. వివిధ విభాగాల్లో ఉన్నత మార్కులు సాధిస్తూ రాష్ట్ర, జిల్లా స్థాయిలో అగ్రగాములుగా నిలిచారు. సీనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో కె. కావ్యకళ, ఎన్. చందన తలా 995/1000 మార్కులు సాధించి ప్రతిభ చాటారు. బైపీసీ విభాగంలో జి. ప్రహర్ష 994/1000 మార్కులతో రాష్ట్రస్థాయిలో అగ్రగామిగా నిలిచింది. జూనియర్ ఇంటర్ ఎంపీసీ విభాగంలో సి.హెచ్. భావన 468/470 మార్కులు సాధించగా, కె. పల్లవి 467, ఎస్.కె. ఫాతిమా 466 మార్కులతో అగ్రస్థానాల్లో నిలిచారు. బైపీసీ విభాగంలో సి.హెచ్. ప్రశాంత్ 437/440 మార్కులు సాధించారు. జూనియర్ సీఈసీ విభాగంలో ఇ. గీతిక 489/500 మార్కులతో ప్రతిభ కనబరిచింది. విద్యార్థులు సాధించిన విజయాలకు కారణమైన అధ్యాపక బృందాన్ని అభినందిస్తూ విద్యార్థుల కృషి, క్రమశిక్షణ వల్లే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని విద్యాసంస్థల డైరెక్టర్లు ఎం. కోటేశ్వరరావు, జి. జగదీష్, వై. వెంకటేశ్వరరావు, డీన్ రామారావు తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఈ సందర్భంగా అభినందించారు.

## ఇల్లెందు మున్సిపల్ కో-ఆప్షన్ సభ్యుల ఎన్నిక







**ఇల్లెందు, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి:** ఇల్లెందు మున్సిపల్ కో–ఆప్షన్ సభ్యుల ఎన్నిక సోమవారం స్థానిక మున్సిపల్ సమావేశం మందిరంలో నిర్వహించారు. 4 కో–ఆప్షన్ సభ్యులకు గానూ 13 మంది దరఖాస్తు చేసుకున్నారు. కో–ఆప్షన్ సభ్యులను చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ పెండేల రాజు, పలువురు కౌన్సిలర్లు ప్రతిపాదించగా మిగతా కౌన్సిలర్లు చేతులెత్తి ఆమోదం తెలిపారు. దీంతో కో–ఆప్షన్ సభ్యులుగా మడుగు సాంబమూర్తి, పర్రె స్వర్ణలత, సయ్యద్ ఆజామ్, షేక్ హసీనా లు ఎన్నికయ్యారు. అనంతరం కో–ఆప్షన్ సభ్యులచే మున్సిపల్ కమిషనర్ గణేష్ ప్రమాణస్వీకారం చేయించారు. నూతన కో–ఆప్షన్ సభ్యులను ఎమ్మెల్యే కోరం కనకయ్య అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కో–ఆప్షన్ సభ్యులు పాలకవర్గంతో కలిసి పట్టణాభివృద్ధికి కృషి చేయాలని సూచించారు. అనంతరం నూతనంగా ఎన్నికైన కో–ఆప్షన్ సభ్యులను శాలువాలు పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర, వైస్ చైర్మన్ పెండేల రాజు, కమిషనర్ గణేష్, మున్సిపల్ కౌన్సిలర్లు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## మొబైల్ సేల్స్, సర్వీస్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

- అసోసియేషన్ అధ్యక్షుడిగా కాగితాల శంకర్ రెడ్డి

**మణుగూరు, ఏప్రిల్ 13, (ప్రజాజ్యోతి):** సబ్ డివిజన్ పరిధిలోని మొబైల్ సేల్స్ మరియు సర్వీస్ యజమానుల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సోమవారం మండల పరిధిలోని హనుమాన్ టెంపుల్ సమీపంలోని అర్బన్ పార్క్, వెన్నెల జలపాతం ప్రాంగణంలో నిర్వహించిన సమావేశానికి మణుగూరు, అశ్వాపురం, బయ్యారం, కరకగూడెం, పినపాక మండలాల మొబైల్ షాపుల యజమానులు భారీ సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడిగా వెల్డన్ మొబైల్ షాపు యజమాని కాగితాల శంకర్ రెడ్డి, కార్యదర్శిగా తేజావత్ సురేష్, కోశాధికారిగా చామకూర సాంబశివరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వంశీ, అఖిల్, సద్దాం ఎన్నిక కాగా గౌరవ అధ్యక్షుడిగా యాదగిరి రామారావు, గౌరవ సలహాదారులుగా ఎస్.డి.రఫీ, పసునూరి రాము, మేడిది కమలాకర్ నియమితులయ్యారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు శంకర్ రెడ్డి మాట్లాడుతూ.... 2019లోయూనియన్ ప్రారంభమైనప్పటి నుంచి ప్రతి రెండు సంవత్సరాలకు ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఏకగ్రీవంగా తనను అధ్యక్షుడిగా ఎన్నుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. యూనియన్ సభ్యులందరికీ సమానంగా న్యాయం చేస్తూ, బాధ్యతలను నిబద్ధతతో నిర్వహిస్తానని హామీ ఇచ్చారు. యూనియన్ సజావుగా కొనసాగడానికి సభ్యుల సహకారం ప్రధానమని పేర్కొన్నారు. అలాగే మణుగూరు సబ్ డివిజన్ పరిధిలోని మొబైల్ వ్యాపారులందరూ ఐక్యంగా ఉండి అసోసియేషన్‌ను మరింత బలోపేతం చేయాలని ఆశాభావం వ్యక్తం చేశారు. ముఖ్యంగా మొబైల్ సర్వీసింగ్, స్పేర్ పార్ట్స్ కొనుగోళ్లలో సమిష్టి నిర్ణయాలు తీసుకోవడం ద్వారా వ్యాపార అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. వినియోగదారులకు మెరుగైన సేవలు అందించడమే కాకుండా యూనియన్ సభ్యుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సబ్ డివిజన్ పరిధిలోని మణుగూరు, అశ్వాపురం, బయ్యారం, కరకగూడెం, పినపాక మండలాలకు చెందిన మొబైల్ షాపుల యజమానులు, యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## వేతన వివక్షతపై పోరాటం అవసరం: భూక్య రమేష్

- అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహణ





**కొత్తగూడెం, ఏప్రిల్ 13 ( ప్రజాజ్యోతి )** వేతనాల్లో వివక్షతకు వ్యతిరేకంగా కార్మిక వర్గం ఐక్యంగా పోరాటం చేయాలని సీఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్ పిలుపునిచ్చారు. సమాన పనికి సమాన వేతనం అమలయ్యే వరకు ఉద్యమం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. సీఐటియు ఆధ్వర్యంలో అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా కొత్తగూడెం పట్టణంలోని కార్మికుల పని ప్రాంతాల వద్ద వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని హక్కుల సాధన కోసం ఐక్యంగా కృషి చేయాలన్నారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించాలని అన్ని రంగాల్లో ఎనిమిది గంటల పని విధానాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరారు. కార్మిక హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వాలు వేతనాల్లో వివక్షత చూపడం సరైనది కాదని విమర్శించారు. అంబేద్కర్ ఆశయాల సాధన కోసం కార్మిక వర్గం ఐక్యంగా ముందుకు సాగాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో సీఐటియు జిల్లా కమిటీ సభ్యులు లిక్కి బాలరాజు, అంబాల దుర్గమ్మ, నందిపాటి రమేష్, వెంకటమ్మ, సంజీవ్, పాషా, శ్యాం కుమార్, సక్రాం, భాస్కర్, రాణి, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్ కార్మికుల పనివేళలు మార్చాలి



**చుంచుపల్లి, ఏప్రిల్ 13 ( ప్రజాజ్యోతి )** తీవ్ర ఎండల కారణంగా కాంట్రాక్ట్ కార్మికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పనివేళలు మార్చాలని బిఎంఎస్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ఇనపనూరి నాగేశ్వరరావు కోరారు. ఈ మేరకు సోమవారం సింగరేణి జీఎం (సివిల్) వెంకటేశ్వర్లు, ఎస్ఈ (సివిల్) రాజేంద్ర ప్రసాద్‌లకు వినతిపత్రం అందజేశారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నందున ఉదయం 6 గంటలకే పనులు ప్రారంభించి మధ్యాహ్నానికి ముగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య, రోడ్డు శుభ్రత, పార్కుల్లో పనిచేసే కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కార్మికులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందించడంతో పాటు పని ప్రదేశాల్లో చలువ పందిళ్లు, ప్రథమ చికిత్స కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. వడదెబ్బ నివారణపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు.

## రోడ్ సేఫ్టీ అవగాహన ర్యాలీ నిర్వహణ

- సర్పంచ్ వెంకటేశ్వర్లు



**పినపాక,ఏప్రిల్ 13(ప్రజాజ్యోతి):** రోడ్ సేఫ్టీ ప్రణాళికలో భాగంగా పినపాక మండలం తొగూడెం గ్రామంలో సర్పంచ్ పూణెం వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ చేపట్టి వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. "హెల్మెట్ ధరించండి – ప్రాణాలను కాపాడండి", "మితి వేగం – సురక్షిత ప్రయాణం" వంటి నినాదాలతో ప్రజల్లో చైతన్యం కల్పించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అచ్చా నవీన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సతీష్, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి టీచర్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రాల్లో.. ఆరోగ్య భాగ్యం

- గర్భిణులు, చిన్నారులపై ప్రత్యేక శ్రద్ధ

**టేకులపల్లి,ఏప్రిల్ 13,ప్రజాజ్యోతి:** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా వేసవిలో చిన్నారులు, గర్భిణులు,బాలింతలకు ఆరోగ్య భాగ్యం కల్పించేందు కు పోషణ పక్వాడా పక్షోత్సవాలను నిర్వహిస్తు న్నారు.ఈనెల 9న ప్రారంభమైన ఈ కార్యక్రమాలు 23వరకు కొనసాగుతాయి.పోషణ పక్వాడ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని సులానగర్ సెక్టార్ ప్రెగల్లపాడు పంచాయతి పడమటిగూడెం అంగన్వాడి సెంటర్ గర్భిణీ స్త్రీలకు, బాలింతలకు సూపర్వైజర్ బి.నిర్మల అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా బి.నిర్మల మాట్లాడుతూ చిన్నారు లు,గర్భిణులు,బాలింతలు ఆరోగ్యంగా ఉండేందుకు పలు సూచనలు అంగన్‌వాడీ కేంద్రంగా అందివ్వనున్నారు అని ఆమె తెలి పారు.గర్భిణి అని తెలిసిన తర్వాత మహిళలు తీసుకోవాల్సిన పౌష్టికాహారం, విశ్రాంతి నియమాలు,ఇతర అంశాలను విశదీ కరించనున్నారు.బాలింతలకు ఆరోగ్య జాగ్రత్తలను వివరి స్తారు.అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహార పదార్థాలు,వివిధ ఆట వస్తువు లతో పిల్లలకు అవగాహన కల్పిస్తారు. చిన్నారులు శారీరక, మానసిక ఇబ్బందులు లేకుండా ఎదిగేందుకు వారికి అవసరమైన పౌష్టికాహారం అవసరం అని ఈ సందర్భంగా తెలియజేశారు.ఏడాది వయస్సు దాటిన నుంచి చిన్నారులకు ఎటువంటి పౌష్టికాహారం తీసుకోవాలి అని ఆమె సూచించారు. సకాలంలో టీకాలు, ఇతర ఆరోగ్య సంరక్షణ చర్యలపై పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు లీలాబాయి, అనసూర్య, శ్రావణి, సావిత్రి, రాములమ్మ, తల్లులు పాల్గొన్నారు.



# ఆధునిక వ్యవసాయం చేపట్టండి

- ఆయిల్ ఫామ్ సాగుతో ఆర్థికంగా అభివృద్ధి చెందుతారు
- పల్లెల్లో మౌలిక సదుపాయాలు బావుంటేనే ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుంది
- గతంలో ఈ ప్రాంతాల్లో ప్రయాణించాలంటే తీవ్ర ఇబ్బందులు ఉండేవి
- రోడ్లు, మంచినీరు, విద్యుత్ వంటి సౌకర్యాలను కల్పించి గిరిజన ప్రాంత అభివృద్ధికి కృషి చేశా...
- తుమ్మల నాగేశ్వరరావు రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖామంత్రి






**అశ్వారావుపేట, ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి :** మారుమూల అటవీ ప్రాంతాల్లో నివసిస్తున్న గిరిజన రైతులు ఆధునిక వ్యవసాయం వైపు మొగ్గు చూపాలని, ఆయిల్ ఫామ్ సాగుతో సాగు చేయడం వలన ప్రతి రైతు ఆర్థికంగా అభివృద్ధి సాధించవచ్చని రాష్ట్ర వ్యవసాయ, చేనేత శాఖా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు.మండలంలోని మొద్దులమడ గ్రామంలో సోమవారం జరిగిన శుభ కార్యానికి హాజరైన మంత్రి గ్రామస్తులతో సమావేశమై స్థానిక పరిస్థితులను సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సుమారు 26 సంవత్సరాల మీరు నీటి పారుదల శాఖ మంత్రిగా పనిచేస్తున్న సమయంలో మా వ్యవసాయ అవసరాల కోసం చెరువును నిర్మించారని ప్రస్తుతం ఆ చెరువుకు నిరుపయోగంగా ఉందని గ్రామస్తులు మంత్రి తుమ్మల దృష్టికి తీసుకువెళ్లారు. గ్రామస్తులతో కలిసి చెరువును పరిశీలించిన మంత్రి తక్షణమే మరమ్మత్తులు చేపట్టేందుకు సానుకూలంగా ఉన్నామని వారికి హామీ ఇచ్చారు. అనంతరం ఇక్కడ గిరిజన రైతులతో మంత్రి తుమ్మల మాట్లాడుతూ గతంలో ఈ ప్రాంతాల్లో ప్రయాణించాలంటే ఎన్నో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వచ్చేదని తనకు అవకాశం వచ్చిన ప్రతిసారి ఈ ప్రాంతంలో రహదారులు, మంచి నీరు, విద్యుత్, పాఠశాలలు వంటి కనీస సౌకర్యాలను కల్పించి ఈ ప్రాంత అభివృద్ధికి తన వంతు సహాయం అందించానన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా జామయిల్ సాగవుతుందని, ఆయిల్ ఫామ్ సాగు చేయటం వల్ల రైతులు ఆర్థికంగా లబ్ధి పొందుతారని అందుకు అనుగుణంగా రైతులతో సమీక్షించి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే జారే ఆదినారాయణ, ఐటిడిఏ పిఓ రాహుల్, మున్సిపల్ వైస్ చైర్మన్ జూపల్లి రమేష్, పలువురు అధికారులు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## అరైవ్ – అ లైవ్" కార్యక్రమాల గోడపత్రికను ఆవిష్కరించిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 13,(ప్రజా జ్యోతి)** ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా రవాణా శాఖ ఆధ్వర్యంలో ఏప్రిల్ 13 నుండి 18 వరకు నిర్వహించనున్న "అరైవ్ – అ లైవ్" కార్యక్రమాల గోడపత్రికను జిల్లా కలెక్టర్ సోమవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, రహదారి భద్రతపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించడం అత్యవసరమని తెలిపారు. ప్రతి సంవత్సరం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలలో మానవ తప్పిదాలే ప్రధాన కారణమవుతున్నాయని పేర్కొంటూ, వాహనదారులు ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. "అరైవ్ – అ లైవ్" కార్యక్రమాల ద్వారా ప్రజల్లో బాధ్యతాయుతమైన డ్రైవింగ్ అలవాట్లు పెంపొందించడం, ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడం లక్ష్యమని అన్నారు, హెల్మెట్ ధరించడం, సీటుబెల్ట్ వినియోగం, అధిక వేగంతో వాహనాలు నడపకపోవడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకుండా ఉండడం వంటి భద్రతా చర్యలను ప్రతి ఒక్కరూ కచ్చితంగా పాటించాలని కలెక్టర్ సూచించారు. యువత ముఖ్యంగా ట్రాఫిక్ నియమాలను పాటిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు.జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాల భాగంగా గ్రామసభలు,అవగాహన ర్యాలీలు, పాఠశాలలు , కళాశాలల్లో ప్రత్యేక చైతన్య కార్యక్రమాలు, డ్రైవర్లకు శిక్షణ శిబిరాలు, ప్రజలకు అవగాహన కల్పించే వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా రవాణా శాఖ అధికారి వి వెంకటరమణ , సిబ్బంది , ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 13,(ప్రజా జ్యోతి)** పాల్వంచ పట్టణంలోని బొల్లోరి గూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న పదవ తరగతి పరీక్ష కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పరీక్షల నిర్వహణను ప్రత్యక్షంగా పరిశీలించి, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలపై సమగ్రంగా ఆరా తీశారు. ఈతనిఖీలలో భాగంగా పరీక్ష హాళ్లలో విద్యార్థుల కూర్చునే విధానం, ప్రశాంత వాతావరణం, తగిన వెలుతురు, తాగునీటి సదుపాయం, విద్యుత్, ఫ్యాన్లు, శుభ్రత వంటి మౌలిక వసతులను పరిశీలించారు. ప్రతి విద్యార్థికి సరైన దూరం పాటిస్తూ కూర్చునేలా చర్యలు తీసుకోవాలని, పరీక్ష సమయంలో ఎటువంటి అంతరాయాలు లేకుండా అన్ని ఏర్పాట్లు సమర్థంగా ఉండాలని అధికారులకు సూచించారు.పరీక్షా కేంద్రంలో ప్రశ్నపత్రాల పంపిణీ, సమాధాన పత్రాల సేకరణ, భద్రపరిచే విధానం వంటి అంశాలను పరిశీలించి, పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకంగా పాటించాలని అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవకతవకలు చోటుచేసుకోకుండా పర్యవేక్షణ ఉండాలని, మాల్ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని స్పష్టం చేశారు.పరీక్షా కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న ఇన్విజిలేటర్లు, సిబ్బంది తమ బాధ్యతలను నిబద్ధతతో నిర్వహించాలని, విద్యార్థులకు అవసరమైన మార్గదర్శకత్వం అందిస్తూ సహాయకరంగా వ్యవహరించాలని తెలిపారు. ప్రత్యేకంగా విద్యార్థులు ఒత్తిడికి లోనవకుండా, ఆత్మవిశ్వాసంతో ప్రశాంతంగా పరీక్షలు రాసేలా ఉపాధ్యాయులు ప్రోత్సహించాలని సూచించారు, ఈ తనిఖీ లో కలెక్టర్ వెంట ప్రధానోపాధ్యాయురాలు మంగమ్మ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం

- తక్షణ చర్యలకు కలెక్టర్ అంకిత్ ఆదేశాలు



**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 13, (ప్రజా జ్యోతి)** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టరేట్ లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రజల నుండి అందిన వినతిపత్రాలు, ఫిర్యాదులను అదనపు కలెక్టర్ వేణుగోపాల్, కొత్తగూడెం ఆర్డీవో మధు, గృహ నిర్మాణ శాఖ పిడి రవీంద్రనాథ్ తో కలసి స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి నుండి పెద్ద సంఖ్యలో హాజరైన ప్రజలు తమ వ్యక్తిగత, సామూహిక సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ ప్రతి ఫిర్యాదును పరిశీలిస్తూ సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి సమస్యలపై వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అనంతరంవీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా వ్యాప్తంగా ఉన్న తహసీల్దారులు, ఎంపీడీవోలు , ఇతర సంబంధిత అధికారులతో మండలాల వారీగా అందిన సమస్యలను నేరుగా చర్చించి,పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ప్రజల సమస్యల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం ఉండకూడదని, అధికారులు సమన్వయంతో బాధ్యతాయుతంగా పని చేయాలని కలెక్టర్ అన్నారు. ప్రతి వినతిపత్రాన్ని సమగ్రంగా పరిశీలించి సమస్యల మూలాలను గుర్తించి దీర్ఘకాలిక పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు.ప్రజలు తమ ఫిర్యాదులను పూర్తి వివరాలతో పాటు అవసరమైన ఆధార పత్రాలతో సమర్పిస్తే పరిష్కారం వేగవంతమవుతుందని తెలిపారు. ప్రజావాణి కార్యక్రమం ద్వారా ప్రభుత్వ సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలని, ప్రతి సమస్యకు సమర్థవంతమైన పరిష్కారం అందేలా అధికారులు కట్టుబడి పనిచేయాలని సూచించారు.అదేవిధంగా ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రజలకు ఉపశమనం కలిగించే చర్యలు చేపట్టాలని, ప్రధాన కూడళ్లలో, ప్రభుత్వ కార్యాలయాల్లో చలివేంద్రాలు తక్షణం ఏర్పాటు చేయాలని జిల్లా అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణిలో స్వీకరించిన కొన్ని దరఖాస్తులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం కొత్త తాండ గ్రామపంచాయతీకి చెందిన గ్రామ ప్రజలు తమ గ్రామంలో రేషన్ షాపు లేకపోవడంతో 4.5 కిలో మీటర్లు ప్రయాణించి రేషన్ బియ్యం తెచ్చుకోవాల్సి వస్తోందని తెలిపారు. గ్రామం మారుమూల ప్రాంతంలో ఉండడం వల్ల వాహన సౌకర్యం లేక వృద్ధులు, గర్భిణీ స్త్రీలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. గ్రామంలో రేషన్ డీలర్ షాపు ఏర్పాటు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించిన కలెక్టర్, తగు చర్యల నిమిత్తం కొత్తగూడెం ఆర్డీవోకు ఎండార్స్ చేశారు.పాల్వంచ గాంధీనగర్ కు చెందిన మంగళగిరి నాగమ్మ తనకు సర్వే నం. 817/36లో భూమి ఉన్నప్పటికీ భూభారతి ఆన్లైన్ లో నిషేధిత భూమిగా చూపిస్తున్నారని, దాన్ని తొలగించాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం ధరణి ఆపరేటర్ కు ఎండార్స్ చేశారు.భద్రాచలం రాజుపేటకు చెందిన శివకుమార్ పదో తరగతి ఉత్తీర్ణుడై 80 శాతం దివ్యాంగుడిగా ఉండి కుటుంబ పోషణ కష్టంగా మారిందని, దివ్యాంగుల కోటాలో మోటార్ బైక్ మంజూరు చేయాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం సంబంధిత దివ్యాంగుల సంక్షేమ శాఖ అధికారికి ఎండార్స్ చేశారు.ఇల్లందు ఎల్బీఎస్ నగర్ కు చెందిన తాటి లాలయ్య తాను దివ్యాంగుడిగా 2022లో 70% అంగవైకల్యంతో సదరం సర్టిఫికేట్ పొందినప్పటికీ ఇప్పటివరకు వికలాంగుల పెన్షన్ మంజూరు కాలేదని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్యల నిమిత్తం డీఆర్ డీఓకు ఎండార్స్ చేశారు. చర్ల మండలం ఆనంద కాలనీకి చెందిన ప్రజలు తమ గ్రామంలో కొంతమంది అర్హత లేని వ్యక్తులు తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో ఎస్టీ కుల ధ్రువీకరణ పొందుతున్నారని, దీనివల్ల నిజమైన గిరిజనులకు సంక్షే మ పథకాలు , ఉద్యోగ అవకాశాల్లో నష్టం జరుగుతోందని, ఈ అంశంపై సమగ్ర విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ చేసిన దరఖాస్తును పరిశీలించి డీ-సెక్షన్ ఓఎస్ డీకి ఎండార్స్ చేశారు.ఈ కార్యక్రమంలో అన్ని శాఖలకు చెందిన జిల్లా అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లో సత్తా చాటిన ప్రముఖ జర్నలిస్ట్ కుమారుడు నితిన్ కుమార్



**పినపాక,ఏప్రిల్ 13(ప్రజాజ్యోతి):** ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో పినపాక మండలం జానంపేట గ్రామానికి చెందిన సీనియర్ జర్నలిస్టు అత్తే లక్ష్మణ్ కుమారుడు నితిన్ కుమార్ ప్రతిభ కనబరిచాడు. ఎంపీసీ గ్రూప్‌లో 463 మార్కులు సాధించి మెరుగైన ఫలితాన్ని అందుకున్నాడు.నితిన్ కుమార్ సాధించిన విజయంపై కుటుంబ సభ్యులు ఆనందం వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు, స్నేహితులు అతనిని అభినందిస్తూ భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయి కి చేరాలని ఆకాంక్షించారు.

## మండలంలోని పంచాయతీలలో రోడ్డు భద్రత కార్యక్రమాలు

- ఎస్సై విజయసింహారెడ్డి పాల్గొని చైతన్యం కల్పన
- అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ప్రతిజ్ఞ కార్యక్రమాలు
- సర్పంచ్ అధ్యక్షతన రోడ్ సేఫ్టీ కమిటీతో అవగాహన



**అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 13,ప్రజా జ్యోతి:** అన్నపురెడ్డిపల్లి మండలంలోని అన్నపురెడ్డిపల్లి, బుచ్చన్న గూడెం, జానకిపురం, మర్రిగూడెం గ్రామ పంచాయతీలలో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా ఎస్సై విజయసింహారెడ్డి పాల్గొని ప్రజల్లో చైతన్యం కల్పించారు.సర్పంచ్ అధ్యక్షతనే నిర్వహించిన కార్యక్రమాల్లో రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగించడం వంటి నియమాలను పాటించాల్సిన అవసరాన్ని వివరించారు.ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. గ్రామాల్లో ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో బాధ్యత పెరుగుతుందని పేర్కొన్నారు.అదేవిధంగా బుచ్చన్న గూడెం, జానకిపురం ప్రాంతాల్లో రహదారులపై ఉన్న గుంతలను తాత్కాలికంగా మరమ్మత్తు చేయించి ప్రయాణికులకు సౌకర్యం కల్పించారు. రహదారి భద్రతపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు.ఈ కార్యక్రమంలో సంబంధిత పంచాయతీల సర్పంచ్‌లు, ఉప సర్పంచ్‌లు, వార్డ్ సభ్యులు పాల్గొన్నారు. అలాగే గ్రామ పంచాయతీ సెక్రటరీలు, రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులు మరియు ప్రజా ప్రతినిధులు హాజరయ్యారు. ప్రజల సహకారంతోనే రోడ్డు ప్రమాదాలను పూర్తిగా నియంత్రించవచ్చని అధికారులు స్పష్టం చేశారు.


## రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన కలెక్టర్ అంకిత్





**కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 13,(ప్రజా జ్యోతి )** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో విలీనం చేసిన ఐదు గ్రామపంచాయతీలను తిరిగి తెలంగాణ రాష్ట్రంలో కలపాలని డిమాండ్ చేస్తూ భద్రాచలంలో నిర్వహిస్తున్న సమరభేరి కార్యక్రమంలో పాల్గొనటానికి జిల్లాకు విచ్చేసిన రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరిని జిల్లా కలెక్టర్ అంకిత్ సోమవారం పాల్వంచ నవభారత్ గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ అంకిత్ పుష్పగుచ్ఛం అందజేసి ఆమెకు స్వాగతం పలికారు. జిల్లాలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలు, ప్రభుత్వ పథకాల అమలు వంటి అంశాలపై చర్చించారు.

## అంబేద్కర్ జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలి



**ఇల్లందు, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి:** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ జీవితాన్ని మనమందరం స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి కీర్తి చంద్రిక రెడ్డి అన్నారు. ఇల్లందు బార్ అసోసియేషన్ ఆవరణలో డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని సోమవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇల్లందు ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రముఖ భారతీయ న్యాయవాది, ఆర్థిక శాస్త్రవేత్త, రాజకీయ నేత, సంఘ సంస్కర్త అని గుర్తు చేశారు. అంబేద్కర్ అంటరానితనం, కుల నిర్మూలన కోసం ఎంతో కృషి చేశాడని కొనియాడారు. అంబేద్కర్ స్వతంత్ర భారతదేశపు మొట్టమొదటి కేంద్ర న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ శిల్పి అని 32 డిగ్రీ పట్టా పొందారని పేర్కొన్నారు.అలాగే 9 భాషలు పట్టు ఉండి మాట్లాడేవారని, ఎక్కువ చదువుపైనే ఆలోచన ఉండేదని, మనుషులందరూ చదువుకుంటేనే మనిషి యొక్క ఆలోచన అనేది మార్పు ఉంటుందని తెలిపారు. చదువుతోనే స్థాయి కూడా మారుతుందనే ఆలోచన ధోరణిలో ఉండేవారని, మనం కూడా ఆయన నుండి చదువుకునే స్ఫూర్తిని, ఆయన జీవితాన్ని స్ఫూర్తిగా తీసుకొని మన ఆలోచన విధానం, మన స్థాయిలలో మార్పు తెచ్చుకోవాలన్నారు. భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో ఆయన కృషి చాలా ఉందని, అంబేద్కర్ ముఖ్యంగా అందరూ సమానమే ఒకరు ఎక్కువ ఒకరు తక్కువ కాదనే అధికరణ రావడానికి కారణం ఆయనే అన్నారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ షేక్ మహమ్మద్ ఖాసిం, కోశాధికారి సపావట్ బన్సిలాల్, సీనియర్ న్యాయవాదులు చెన్నకేశవరావు, బాలకృష్ణ, సువర్ణపాక సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికి పాల్వంచలో ఘన స్వాగతం



**పాల్వంచ, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పర్యటనలో భాగంగా సోమవారం పాల్వంచకు విచ్చేసిన రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరికు కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్పనా చౌదరి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. పాల్వంచ మండలంలోని నవభారత్ అతిథి గృహంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో కల్పనా చౌదరి చేతుల మీదుగా రేణుక చౌదరికి శుభాకాంక్షలతో వేంకటేశ్వరస్వామి విగ్రహాన్ని బహుమానంగా అందజేశారు. అనంతరం జిల్లా వ్యాప్తంగా ఉన్న పలు సమస్యలను రేణుక చౌదరి దృష్టికి తీసుకెళ్లి, గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖులు, స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

## భూ సమస్యలపై బీజేపీ రిలే నిరాహార దీక్ష

- అక్రమ భూ బదలాయింపులపై చర్యలు తీసుకోవాలి – బీజేపీ డిమాండ్




**దమ్మపేట,ఏప్రిల్ 13,(ప్రజాజ్యోతి):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా దమ్మపేట తహశీల్దార్ కార్యాలయం ఎదుట భారతీయ జనతా పార్టీ అశ్వారావుపేట నియోజకవర్గ నాయకులు తంబళ్ల రవి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షను చేపట్టారు. భూ సమస్యల పరిష్కారం కోసం ఈ నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు తమ ప్రధాన డిమాండ్లను వెల్లడించారు. అక్రమ భూ బదలాయింపులపై ఉన్నత స్థాయి అధికారులతో సమగ్ర విచారణ జరిపించాలని, కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తక్షణమే గుర్తించి భూమి లేని నిరుపేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. గత 30 సంవత్సరాలుగా అక్రమ భూ బదలాయింపులకు పాల్పడిన రెవెన్యూ సిబ్బందిని గుర్తించి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే ఫోర్జరీ పాస్ పుస్తకాలపై ఉన్నత స్థాయి విచారణ జరిపించాలని, 1/70 యాక్ట్ –ఏజెన్సీ చట్టాలను ఉల్లంఘించి అక్రమంగా భూ హక్కులు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షులు పల్లపు వెంకటేశ్వర్లు, పశుమర్తి పుల్లారావు, స్టేట్ కౌన్సిల్ మెంబర్ కొలిక పోగు మునలయ్య, మాజీ జిల్లా సెక్రటరీ ఉడతనేని విశ్వేశ్వరరావు, మాజీ ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షులు గూడా ముత్యాల రావు, దొడ్డా సతీష్, పూచి ప్రసాద్, సొరకాయల సీతారాములు, కారం రత్నా కుమారి, అల్లా సుజాతతో పాటు భూ బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## చెత్త కుప్పలతో వీరునాయక్ తండా విలవిల

- ప్రజారోగ్యంపై ముప్పు
- కుండీల ఏర్పాటుకు డిమాండ్



**పాల్వంచ, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి:** పాల్వంచ మండలం బసవతారక కాలనీ గ్రామ పంచాయతీ పరిధిలోని వీరునాయక్ తండాలో చెత్త నిర్వహణ లోపాలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయి. గ్రామంలో పేరుకుపోతున్న చెత్త కారణంగా ప్రజలు అనారోగ్య సమస్యలను ఎదుర్కొంటుండగా, తక్షణ చర్యలు తీసుకోవాలని స్థానికులు నునావత్ ప్రసాద్ గ్రామ పంచాయతీ కార్యదర్శికి వినతి పత్రం సమర్పించారు. గ్రామంలోని చివరి వీధి సమీపంలో రహదారి పక్కన ఎటువంటి నియంత్రణ లేకుండా చెత్త వేయడంతో ఆ ప్రాంతం డంపింగ్ యార్డుగా మారిపోయిందని స్థానికులు పేర్కొన్నారు. చెత్త పేరుకుపోవడంతో దుర్వాసన వ్యాపించి అస్వచ్ఛ వాతావరణం నెలకొనడంతో పాటు, దోమల పెరుగుదల అధికమై జ్వరాలు, వైరల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రత్యేకంగా వర్షాకాలంలో మోరీలు మూసుకుపోయి నీరు నిల్వ ఉండటం వల్ల గతంలో పలుమార్లు కాలుష్య సమస్యలు తలెత్తిన విషయాన్ని గ్రామస్థులు గుర్తు చేశారు. సీతానగర్ కాలనీ, బసవతారక కాలనీ, వీరునాయక్ తండా ప్రాంతాల్లో వీధులు సన్నగా ఉండటంతో చెత్త సేకరణ వాహనాలు సక్రమంగా తిరగలేకపోవడం సమస్యను మరింత తీవ్రమయ్యేలా చేస్తోంది. ఈ నేపథ్యంలో ప్రతి వీధికి అనువైన ప్రదేశాల్లో చెత్త కుండీలు ఏర్పాటు చేయడంతో పాటు, సేకరించిన చెత్తను వారానికి కనీసం నాలుగు సార్లు ట్రాక్టర్ ద్వారా డంపింగ్ యార్డుకు తరలించే విధంగా చర్యలు తీసుకోవాలని నునావత్ ప్రసాద్ కోరారు. అలాగే గ్రామంలో స్వచ్ఛతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ఎక్కడ పడితే అక్కడ చెత్త వేయడాన్ని నిరోధించాల్సిన అవసరం ఉందని సూచించారు. ఇంకా, చెత్త నిర్వహణ కోసం ప్రత్యేక సిబ్బంది నియామకం, మురుగు కాలువల శుభ్రపరిచే పనులను క్రమం తప్పకుండా నిర్వహించడం, ఫాగింగ్ చర్యలు చేపట్టడం ద్వారా దోమల నియంత్రణ సాధ్యమవుతుందని స్థానికులు అభిప్రాయపడ్డారు. ప్రజారోగ్యానికి సంబంధించిన ఈ కీలక సమస్యపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమగ్ర చర్యలు చేపట్టి గ్రామంలో పరిశుభ్ర వాతావరణం కల్పించాలని ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# ప్రజల భాగస్వామ్యంతో ప్రమాదాల నివారణ: కలెక్టర్ అంకిత్






**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13 ( ప్రజాజ్యోతి )** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా జిల్లా వ్యాప్తంగా రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. సోమవారం చుంచు పల్లి గ్రామపంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన గ్రామసభలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6 నుంచి ప్రారంభమైన 99 రోజుల కార్యక్రమంలో ప్రతి వారం వివిధ అంశాలపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహించడంతో పాటు డీ–అడిక్షన్, కౌన్సిలింగ్ సేవలను కూడా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. జిల్లాలోని అన్ని గ్రామపంచాయతీలలో గ్రామసభలు నిర్వహిస్తూ ప్రజలను భాగస్వాములుగా చేసుకుని అవగాహన కల్పిస్తున్నామని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతిరోజూ అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ బాధ్యతాయుత ప్రవర్తన ద్వారానే ప్రమాదాలను తగ్గించవచ్చని తెలిపారు. ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్ల గుర్తింపు, రహదారుల వెంట ఉన్న పిచ్చి మొక్కల తొలగింపు, ప్రమాద ప్రాంతాల్లో జాగ్రత్త చర్యలు చేపడుతున్నామని చెప్పారు. ప్రమాదాల సమయంలో అంబులెన్స్ సేవలు సమయానికి అందుబాటులో ఉన్నాయా సమీప ఆసుపత్రులకు కనెక్టివిటీ ఎలా ఉందనే అంశాలను కూడా సమీక్షిస్తున్నామని వివరించారు. పాఠశాల విద్యార్థులకు రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా వారు తమ తల్లిదండ్రులకు హెల్మెట్, సీట్ బెల్ట్ ప్రాముఖ్యతను తెలియజేసేలా చేయాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసినప్పుడే ప్రమాద రహిత జిల్లాను సాధించగలమని అన్నారు. నో హెల్మెట్ – నో ఎంట్రీ వంటి వినూత్న చర్య లు ఇతర జిల్లాల్లో మంచి ఫలితాలు ఇస్తున్నాయని అలాంటి విధానాలను ఇక్కడ కూడా అమలు చేయాలని సూచించారు. అతివేగం, డ్రంక్ అండ్ డ్రైవ్, హెల్మెట్ ధరించకపోవడం, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం వంటి కారణాలతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. అన్ని శాఖలు సమన్వయంతో రోడ్డు భద్రత వారోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం గ్రామస్థులతో కలిసి రోడ్డు భద్రత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ భూక్య శాంతి శ్రీ, తహసీల్దార్ నాగరాజు, పంచాయతీ ఈవో వెంకటేశ్వర్లు, రవాణా, పోలీస్ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆరోగ్య సూచికలు మెరుగుపర్చాలి

- ప్లాస్టిక్ వినియోగంపై అప్రమత్తం కావాలి: డీఎంహెచ్‌వో తుకారం రాథోడ్



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13 ( ప్రజాజ్యోతి )** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆరోగ్య శాఖ అధికారి డా. తుకారం రాథోడ్ ప్రజలు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. సోమవారం నిర్వహించిన ఎల్‌టీలు, ఫార్మసీ అధికారుల నెలవారీ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం పెరుగుతున్న నేపథ్యంలో అనేక అనారోగ్య సమస్యలు, ముఖ్యంగా క్యాన్సర్ కేసులు పెరుగుతున్నాయని తెలిపారు. ఆహార పదార్థాలు, త్రాగునీటికి ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలని సూచించారు. బయట ఆహారం తినేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని రీసైకిల్ చేసిన నూనెల వాడకం ఆరోగ్యానికి హానికరమని పేర్కొన్నారు. ప్రతి రోజు తగినంత నీరు తాగడం, వ్యాయామం, నడక, యోగా వంటి శారీరక శ్రమను అలవాటు చేసుకోవాలని సూచించారు. జిల్లా గిరిజన ప్రాంతం కావడంతో పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని అవసరమైన మందులు, రక్తపరీక్షలు అందుబాటులో ఉంచాలని అధికారులకు ఆదేశించారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం సహించబోమని హెచ్చరించారు. క్యాన్సర్ నివారణలో భాగంగా HPV టీకాపై ప్రజల్లో అవగాహన పెంచి అర్హులైన యుక్తవయస్క బాలికలకు టీకా అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో ఆరోగ్య సూచికలను మెరుగుపర్చేందుకు ప్రతి సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేయాలని ఆసుపత్రులకు వచ్చే రోగులతో మర్యాదగా వ్యవహరించాలని తెలిపారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, బస్తీ దవాఖానలు, పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని హెచ్చరించారు. పాముకాటు, కుక్కకాటు మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఎండాకాలంలో వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. సికిల్ సెల్, థలసేమియా, హెచ్ఐవీ, టిబి వంటి వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంచాలని తెలిపారు. టిబి అనుమానితుల నుంచి నమూనాలు సేకరించాలని, బీపీ, షుగర్ మందులు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ప్రతిరోజూ ప్రగతి నివేదికలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. సాయి కల్యాణ్, మలేరియా ప్రోగ్రామ్ అధికారి డా. రాందాస్, సొమ్లా, రాంప్రసాద్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.



## రహదారి భద్రత మనందరి బాధ్యత

- అరైవ్ - అలైవ్ లో భాగంగా గ్రామపంచాయతీలలో భద్రత కమిటీల నియమకం.... పింగళి నాగరాజు సర్కిల్ ఇన్స్పెక్టర్




**అశ్వారావుపేట, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి :** రహదారి భద్రత విషయంలో మనందరం బాధ్యతగా వ్యవహరించాలని అశ్వారావుపేట సర్కిల్ ఇన్స్పెక్టర్ పింగళి నాగరాజు అన్నారు. మంగళవారం ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో అరైవ్ – అలైవ్ లో భాగంగా రహదారి భద్రత వారోత్సవాల కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా ఊట్లపల్లి గ్రామపంచాయతీలో అశ్వారావుపేట నుండి భద్రాచలం వెళ్లే ప్రధాన రహదారిలో ప్రమాదకరంగా ఉన్న మలుపుల వద్ద జెసిబి లతో పిచ్చి మొక్కలను తొలగించారు. అంతేకాకుండా ప్రతి గ్రామ పంచాయతీలోను పంచాయతీ వార్డు మెంబర్ లు,అంగన్వాడి, ఆశా కార్యకర్తలతో రోడ్ భద్రతా కమిటీని ఏర్పాటు చేస్తున్నట్లు సిఐ నాగరాజు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఐ యాయాతి రాజు, సర్పంచ్ సత్యం లక్ష్మి కుమారి, వార్డు మెంబర్లు పలువురు గ్రామస్తులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు

## ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చిన భద్రాద్రి రామయ్య



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి,** భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారు సోమవారం సందర్భంగా భక్తులకు ముత్తంగి అలంకారంలో దర్శనమిచ్చారు. ఈ సమయంలో అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. విశ్వక్సేనార్చన, పుణ్యహావచనం, కంకణదారణ, యోజ్ఞపవీతదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, తలంబ్రాలు,వేద ఆశీర్వచనం నిర్వహించారు.

# నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ఐదు పంచాయతీల కోసం పోరాడుతూనే ఉంటా..

- ఐదు గ్రామ పంచాయతీల ప్రజలు రాముని పాదాల చెంతకు ఎప్పుడు చేరుతామా అని ఎదురుచూస్తున్నారు
- అక్కడి ప్రజలు నరక యాతన పడుతున్నారు
- భద్రాద్రి పునరేకీకరణ విస్తృతస్థాయి సమావేశంలో రాజ్యసభ సభ్యురాలు రేణుకా చౌదరి
- పాల్గొన్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి, భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం, మాజీ ఎమ్మెల్యే పొదెం వీరయ్యలు
- నా కంఠంలో ప్రాణం ఉన్నంత వరకు ఐదు గ్రామ పంచాయతీలను భద్రాచలంలో విలీన సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడుతూనే ఉంటానని రాజ్యసభ ఎంపీ రేణుకా చౌదరి అన్నారు.










**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 13 ప్రజాజ్యోతి,** భద్రాచలంలో సోమవారం భద్రాద్రి పునరేకీకరణ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొని మాట్లాడారు. విభజన సమయంలో భద్రాచలంను ఆంధ్రప్రదేశ్‌లో కలిపే ప్రయత్నం జరిగిందని, ఆనాడు జేఏసీ ఛలో భద్రాచలం కార్యక్రమం ఏర్పాటు చేయడంతో భద్రాచలం పట్టణం మాత్రం తెలంగాణకే మిగిలిందన్నారు. ఐదు గ్రామ పంచాయతీల సమస్యను పార్లమెంటులో ప్రసాతవించడం ఆ రాముడు నాకిచ్చిన వరమని, కేంద్రం మెడలు వంచైనా నేను సమస్యను పరిష్కరిస్తానని తెలిపారు. ఆ రామ భక్తురాలిగా నేను ఐదు గ్రామ పంచాయతీల సమస్య పరిష్కారమయ్యే వరకు పోరాడుతూనే ఉంటానని ఆమె వివరించారు. అనంతరం రాష్ట్రై ప్రభుత్వ ఉద్యోగుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షులు ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ ఐదు గ్రామ పంచాయతీలు భద్రాద్రి పునర్జీవంకు, తెలంగాణ అస్థిత్వంకు సంసంబంధించినవని, మేము చేపట్టే ఉద్యమానికి తెలంగాణ ప్రజలందరూ సహకారంతో పాటు భాగస్వామ్యం అవసరమన్నారు. మా జేఏసీ తరపున ఉద్యమాన్ని ముందుకు తీసుకెళ్లే బాధ్యత మాదేనని, ఇక్కడి ప్రజలు మాత్రం నిరంతరం ఐదు గ్రామ పంచాయతీలపై ప్రభుత్వాన్ని ప్రశిస్తూ, సమస్యను కేంద్ర ప్రభుత్వ పెద్దల వరకు తీసుకెళ్లే బాధ్యత మీపైకూడా ఉందన్నారు. అనంతరం బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ భద్రాచలంతోనే ఐదు గ్రామపంచాయతీల పేగుబంధం ముడిపడి పడి ఉందని, భద్రాద్రి రామయ్య పాదాల చెంతకు ఎప్పుడు చేరుదామా అని ఎదురు చూస్తున్నారని బీఆర్ఎస్ రాష్ట్రై నాయకులు ఏనుగుల రాకేష్‌రెడ్డి వెల్లడించారు.

ఐదు గ్రామ పంచాయతీల ప్రజలు ఏపీ రాజధాని అమరావతికి సద్దికట్టుకొని వెళ్తే మళ్లీ ఎప్పుడు వస్తారో తెలియదన్నారు. ఐదు గ్రామ పంచాయలైన కన్నాయిగూడెం, యటపాక, పిచుకలపాడు, గుండాల, పురుషోత్తపట్నం పంచాయతీలు తిరిగి భద్రాచలంకు ఇస్తేనే భద్రాచలంకు ఒక రూపు వస్తుందని, అందుకే ఈ వేదిక నుంచే ఉద్యమ శంఖారావం పూరిద్దామని అన్నారు. రాష్ట్ర విభజన సైతం అసమగ్రంగా జరిగిందని, ఇప్పటికే అనేక సమస్యలు పెండింగులోనే ఉన్నాయన్నారు. అలాగే భద్రాచలంలో చెత్త వేయడానికి స్థలం లేకపోవడంతో గోదావరి ఒడ్డున పదేళ్లుగా చెత్తును డంప్ చేస్తుండటంతో గోదావరి జలాలు కలుషితమవుతునాన్యన్నా.

అసలు ఐదు గ్రామ పంచాయతీల ప్రజలను ఓట్లు అడిగేందుకు ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్ధులెవరు రారని, ఐదు పంచాయతీల్లో సమస్యలను సైతం ఏపీ ప్రభుత్వం పట్టించుకోదన్నారు. ఈ సమస్య మన తెలంగాణ, భద్రాచలందే కాదని, భద్రాద్రి శ్రీరాముని గౌరవం, అస్తిత్వంకు సంబంధించిన సమస్యని తెలిపారు. రాష్ట్ర విభజన సమయంలో ఖమ్మం జిల్లాలోని ఏడు మండలాలను ఆంధ్రప్రదేశ్ లో విలీనం చేయడం అశాస్త్రీయంగా జరిగిందని, దీనివల్ల స్థానిక గిరిజనులు, సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు.

విలీన మండలాల్లోని ఐదు గ్రామాల ప్రజలు భౌతికంగా ఆంధ్రప్రదేశ్ లో ఉన్నప్పటికీ, మానసికంగా తాము భద్రాచలంతోనే పెనవేసుకుపోయి ఉన్నారన్నారు. అనంతరం అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు, అటవీ అభివృద్ది సంస్థ చైర్మన్ పొదెం వీరయ్యలు మాట్లాడుతూ ఏపీ విభజనతో భద్రాచలం ఏజెన్సీలోని ఆదివాసీలు తీవ్రంగా నష్టపోయారని, ప్రస్తుతం ఐదు గ్రామ పంచాయతీలనైనా తిరిగి భద్రాచలం మండలంలో కలిపితే భద్రాచలం పుణ్యక్షేత్రం అభివృద్దికి దోహదపడుతుందన్నారు. ఏపీ సీఎం చంద్రబాబునాయుడు సానుకూలంగా ఉంటే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించడం పెద్ద సమస్య కాదని పేర్కొన్నారు. మనందరం సమిష్టిగా ఏపీ సీఎంను కలిసి ఈ సమస్యను సానుకూల వాతావరణంలో పరిష్కరించేందుకు కృషి చేద్దామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర టీజీవో అధ్యక్షులు ఏలూరు శ్రీనివాసరావు, టీఎన్‌జీవో ఖమ్మం జిల్లా అధ్యక్షులు గుంటుపల్లి శ్రీనివాసరావు, టీఎన్‌జీవో కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు అమరనేని రామారావు, భద్రాచలం టీఎన్‌జీవో నాయకులు డెక్క నరసింహారావు, బాలకృష, కార్యదర్శి చైతన్య భార్గవ్, భద్రాద్రి జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షులు చల్లగుళ్ల నాగేశ్వరరావు, కామేశ్వరావు, భద్రాచలం బీఆర్ఎస్ నాయకులు మానె రామకృష్ణ, రావులపల్లి రాంప్రసాద్, ఆకోజు సునీల్, కావూరి సీతామహాలక్షి , నక్కా వెంకన్న, సంపత్, అజ్జి నాయక్, శివ, అవులూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా చూడడానికి జాతీయ విపత్తుల బృందం



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 13 ,ప్రజాజ్యోతి,** రాబోవు కాలంలో అనుకోకుండా విపత్తులు కానీ భారీ వర్షాలు మరియు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు వాటిని ధైర్యంగ ఎదుర్కొని తనకు తాను రక్షించుకోవడమే కాక ఇతర ప్రాణ నష్టం ఆస్తి నష్టం జరగకుండా చూడడానికి జాతీయ విపత్తుల బృందం ప్రయోగ రూపంలో విద్యార్థిని విద్యార్థులకు వివరించడం జరిగిందని భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ జాన్ మిల్టన్ అన్నారు. సోమవారం నాడు భద్రాచలంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ విపత్తు దళం ఆధ్వర్యంలో రాబోవు కాలంలో విపత్తులు అయిన, భారీ వర్షాలు, అగ్నిమాపక ప్రమాదాలు మొదలైనవి వచ్చినప్పుడు విద్యార్థినీ విద్యార్థులు అధైర్య పడకుండా ప్రతిభ పాటవాలను మేధాశక్తిని ఉపయోగించి ఎదుర్కోవాలని అన్నారు. విద్యార్థినీ విద్యార్థులకు పూర్తిస్థాయిలో అర్థమయ్యే విధంగా జాతీయ విపత్తుల దళం సభ్యులు ప్రయోగ రూపంలో ప్రదర్శించి విద్యార్థినీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమములో ఎన్.ఎస్.ఎస్ యూనిట్స్ ఆఫీసర్స్ డాక్టర్ కిరణ్ కుమార్, పి సుధాకర్ రావు, కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులు పాల్గొన్నారు.

## దరఖాస్తు చేసుకున్న గిరిజనుల సమస్యలను పరిష్కరించే బాద్యత అధికారులదే

- భద్రాచలం ఐటీడీఏ ఏపీవో జనరల్ డేవిడ్‌రాజు



**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి,** వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి వివిధ వ్యక్తిగత సమస్యలు, ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల ద్వారా జీవనోపాధి పెంపొందించుకోవడానికి గిరిజన దర్బార్ లో దరఖాస్తు చేసుకున్న ప్రతి గిరిజన కుటుంబాలకు అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందేలా యూనిట్ అధికారులు కృషి చేయాలని ఐటిడిఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. సోమవారం నాడు ఐటీడీఏ సమావేశం మందిరంలో నిర్వహించిన గిరిజన దర్బార్లో వివిధ ఆదివాసి గిరిజన గ్రామాల నుంచి వివిధ సమస్యల గురించి అర్జీలు సమర్పించడానికి వచ్చిన గిరిజనుల నుండి ఆయన అర్జీలు స్వీకరించారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి సంబంధిత అధికారులకు పంపుతూ అర్హులైన ప్రతి గిరిజనులకు ప్రభుత్వం ద్వారా ప్రవేశపెట్టే సంక్షేమ పథకాలు అందే విధంగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిడి ట్రైబల్ వెల్ఫేర్ అధికారి అశోక్, ఏడిఎంహెచ్వో సైదులు, ఏవో సున్నం రాంబాబు, ఏపీవో పవర్ వేణు, డిటిఆర్ఓఎఫ్ఆర్ లక్ష్మీనారాయణ, ఎల్ టి ఆర్ డీటి నాగేశ్వరరావు, మేనేజర్ ఆదినారాయణ, ఐసిడిఎస్ సూపర్వైజర్ అనసూయ, మిషన్ భగీరథ ఏ ఈ ఈ నారాయణరావు, హౌసింగ్ ఏఈ హేమంత్, గురుకులం ప్రిన్సిపాల్ పద్మావతి, వివిధ విభాగాలకు చెందిన సిబ్బంది జోగారావు, ఝాన్సీ, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతపై అవగాహన పెంచుకుందాం - ప్రాణాలు కాపాడుకుందాం

- భద్రాచలంలో ఆర్టీసీ ఆధ్వర్యంలో 'అరైవ్ ఎలైవ్' ర్యాలీ

**భద్రాచలం టౌన్, ఏప్రిల్ 13 ప్రజాజ్యోతి,** ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా సోమవారం భద్రాచలం ఆర్టీసీ డిపో ఆధ్వర్యంలో 'అరైవ్ ఎలైవ్' అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆర్టీసీ సిబ్బంది బస్టాండ్ నుండి అంబేద్కర్ సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీలో మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని, డ్రైవింగ్ చేస్తూ సెల్‌ఫోన్ వాడటం మృత్యువుకు ఆహ్వానమని నినాదాలు చేస్తూ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ జంగయ్య మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. "ప్రమాదాలు అనేవి క్షణికాలక్ష్యం వల్ల జరుగుతాయని, వాహనదారులు అప్రమత్తంగా ఉంటే విలువైన ప్రాణాలను కాపాడుకోవచ్చు" అని ఆయన తెలిపారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం వల్ల కుటుంబాలు వీధిన పడుతున్నాయని, ఆ అలవాటును మానుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం సీఐ నాగరాజు, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ తిరుపతి, డిపో మెకానికల్ ఇంజనీర్ శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుల్ రాజుతో పాటు పెద్ద సంఖ్యలో ఆర్టీసీ కార్మికులు, అధికారులు పాల్గొన్నారు.



## ఇందిరమ్మ నూతన గృహప్రవేశం కార్యక్రమంకు హజరైన - ఎమ్మెల్యే

- బిల్లులు చెల్లింపులో జాప్యం ఉండదు - ఎమ్మెల్యే కోరం కనకయ్య



**టేకులపల్లి,ఏప్రిల్13,ప్రజాజ్యోతి:** మండలంలోని బద్దుతండా పంచాయితీ సామ్య తండా గ్రామంలో లబ్దిదారి భూక్యాసంధ్య –సురేష్ ఇందిరమ్మ ఇళ్ళు గృహప్రవేశం కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సోమవారం ఎమ్మెల్యే కోరం కనకయ్య హాజరైన రిబ్బెన్ కట్ చేసి నూతన ఇంటి గృహప్రవేశం కార్యక్రమం చేశారు.లబ్దిదారులను ఎమ్మెల్యే శాలువాతో సన్మానించారు.నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇళ్ళు త్వరగా పూర్తి అయ్యేలా చూడాలి అని ఆయన తెలిపారు. బిల్లుల చెల్లింపులు విషయంలో జాప్యం చేయకుండా చూడాలని ఏఈ గణేష్‌ని అదేశించారు.మండలంలోని బద్దుతండ,గోలియాతండలో పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే కోరం కనకయ్య నివాళుల ర్పించి ఆర్థికసాయం అందజే శారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్ , స్థానిక సర్పంచ్ నరేష్, మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు,సర్పంచులు, స్థానిక నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## పోషణ పక్వాడా కార్యక్రమం



**చర్ల, ఏప్రిల్ 13:(ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో సోమవారం ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో గల చర్ల సెక్టార్ సుబ్బంపేట, ఆంజనేయ పురం సెక్టార్లు సంయుక్తంగా పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ఆహార పదార్థాలు చిరుధాన్యాలతో ఆరోగ్యకరమైన వంటల ప్రదర్శన , వంటల పోటీలు నిర్వహించారు . స్థానికంగా లభించే పోషక విలువలున్న ఆహార పదార్థాలు ముఖ్యంగా చిరుధాన్యాలను ఉపయోగించి ఆరోగ్యకరమైన వంటకాలు ఎలా తయారు చేయాలో తల్లులకు సిడిపిఓ చైతన్య వివరిస్తూ ప్రతి వంటకంలో ఉపయోగించిన పదార్థాల పోషక విలువలను వివరించి సమతుల ఆహారం యొక్క ప్రాముఖ్యతను వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిడిపిఓ చైతన్య మేడం , సూపర్వైజర్లు ఆదిలక్ష్మి మేడం , స్వరూప రాణి , పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ పి. నాగరాజు, అంగనవాడి టీచర్లు గర్భవతులు, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామాల్లో పాతబావుల నిర్మూలన చేపట్టాలి: బోడు ఎస్ ఐ శ్రీనివాస్ రెడ్డి



**టేకులపల్లి,ఏప్రిల్13,ప్రజాజ్యోతి:** టేకులపల్లి మండలంలోని అన్ని గ్రామాల్లో పాత బావుల నిర్మూలన చేపట్టాలని బోడు ఎస్సై శ్రీనివాసరెడ్డి తెలిపారు. సోమవారం బోడు గ్రామంలో నిర్వహించినటువంటి రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమంలో భాగంగా సమావేశం నిర్వహించారు. అనంతరం గ్రామంలో తిరిగి ఉపయోగంలో లేని పాత బావులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వేసవిలో పిల్లల భద్రత కూడా తల్లిదండ్రులు తీసుకోవాలని, ఎండలకు బయటకు వెళ్లకుండా నీటి ప్రవాహాలు ఉన్న చోటికి వెల్లనీయకుండా చూడాలన్నారు.ఈ కార్యక్రమంలో బోడు సర్పంచ్ పొదెం స్వరూప–సుధీర్, డ్వాక్రా మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మంత్రి తుమ్మలతో ఎమ్మెల్యే, మున్సిపల్ ప్రజాప్రతినిధుల భేటీ

- తెలంగాణ ముఖ ద్వారం అశ్వారావుపేట ఆదర్శంగా ఉండాలి - మంత్రి తుమ్మల



**దమ్మపేట,ఏప్రిల్ 13, (ప్రజాజ్యోతి)** :దమ్మపేట మండలం గండుగులపల్లిలో సోమవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్స్ శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావును అశ్వారావుపేట ఎమ్మెల్యే జారే ఆదినారాయణ ఆధ్వర్యంలో మున్సిపల్ ప్రజా ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్, కౌన్సిలర్లు,పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.అశ్వారావుపేట ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో ఉన్నందున ఇది తెలంగాణకు ముఖద్వారం అని మంత్రి పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ వైపు నుంచి రాష్ట్రంలోకి ప్రవేశించే వారికి అశ్వారావుపేట పట్టణం అందంగా, ఆకర్షణీయంగా కనిపించేలా సుందరీకరణ పనులు చేపట్టాలని సూచించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీలకు ఆదర్శంగా నిలిచేలా అశ్వారావుపేట అభివృద్ధి చెందాలని స్పష్టం చేశారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు తమ తమ వార్డుల్లో ఉన్న సమస్యలను గుర్తించి, మున్సిపల్ కమిషనర్లతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనుల్లో వేగం పెంచాలని మంత్రి దిశానిర్దేశం చేశారు.అలాగే ఇటీవల అశ్వారావుపేట మున్సిపాలిటీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తరపున గెలుపొందిన కౌన్సిలర్లను ఎమ్మెల్యే జారే ఆదినారాయణ మంత్రికి పరిచయం చేశారు. ప్రజల ఆశీస్సులతో గెలుపొందిన ప్రజాప్రతినిధులు తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ పట్టణ అభివృద్ధికి కృషి చేయాలని మంత్రి సూచించారు.అశ్వారావుపేట మున్సిపాలిటీ పరిధిలో మౌలిక వసతుల అభివృద్ధి, మంచినీటి సరఫరా, రహదారులు, పారిశుద్ధ్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని పేర్కొంటూ నియోజక వర్గ అభివృద్ధికి ప్రభుత్వం తరపున పూర్తి సహకారం అందిస్తామని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో జూపల్లి రమేష్, మున్సిపల్ కౌన్సిలర్లు,పార్టీ ముఖ్య నాయకులు పాల్గొని తమ సమస్యలను మంత్రికి వివరించారు.

## డెడ్ బాడీ ఫ్రీజర్ ,వీల్ చైర్ వితరణ



**చర్ల , ఏప్రిల్ 13:(ప్రజా జ్యోతి ):**చర్ల మండలంలో సోమవారం చర్ల ప్రజలు డెడ్ బాడీ ఫ్రీజర్ లేక మండలంలోని ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకొని చర్ల కూల్ డ్రింక్ షాప్ డీలర్ చింతలపూడి రామకృష్ణ వారి సతీమణి చింతలపూడి సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం చర్ల గ్రామపంచాయతీ కార్యాలయం వారికి డెడ్ బాడీ ఫ్రీజర్ సుమారు 80 వేల రూపాయలతో చేయించి అందజేశారు. అనంతరం చర్ల ప్రభుత్వ ఆసుపత్రిలో నడవలేని రోగులను చూసి వారికోసంవారి సతీమణి సుబ్బలక్ష్మి జ్ఞాపకార్థం వీల్ చైరు సుమారు పదివేల రూపాయలతో చేయించి డాక్టర్ సాయి వర్ధన్ , సి హెచ్ . రాంప్రసాద్ చేతుల మీదుగా అందజేశారు. చర్ల మండల ప్రజలకు ఉపయోగపడే కార్యక్రమాలు చేసినందుకు రామకృష్ణ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు మండల వాసులు తెలియచేసారు. ఈ కార్యక్రమంలో చర్ల బీఆర్ఎస్ పార్టీ మండల కన్వీనర్ దొడ్డి తాతారావు , బిఆర్ ఎస్ బీసీ సెల్ అధ్యక్షులు గోరింట్ల వెంకటేశ్వరరావు ,పార్టీ సీనియర్ నాయకులు పంజా రాజు, తడికల బుల్లెబ్బాయి, చెన్నుమల్ల వంశి తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకలకు ఆహ్వానం

- పాల్వంచలో ఘనంగా నిర్వహణ ఏర్పాట్లు.



**పాల్వంచ, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి:** భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీ.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా పాల్వంచ పట్టణంలో ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.అఖిల భారత అనుసూచిత జాతి, అనుసూచిత తెగల హక్కుల పరిరక్షణ సంఘం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14వ తేదీ ఉదయం 10 గంటలకు పాల్వంచ బీసీఎం రోడ్డులో ఉన్న అంబేద్కర్ విగ్రహం వద్ద జయంతి కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పుష్పమాలలు సమర్పించి గౌరవ నివాళులు అర్పించనున్నారు.ఈ వేడుకలకు ప్రజలందరూ హాజరై అంబేద్కర్ ఆశయాలను స్మరించుకుంటూ గణనీయంగా పాల్గొనాలని నిర్వాహకులు పత్రిక సమావేశం ద్వారా విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో సంఘ అధ్యక్షుడు కాల్వ ప్రకాశరావు, గౌరవ అధ్యక్షుడు కాల్వ భాస్కర్ రావు, నాయకులు రాజేంద్ర కుమార్, వసుమల్ల సుందర్రావు, పుష్పరాజు, కాల్వ అశోక్, జూపూడి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గిస్తేనే క్యాన్సర్ ప్రమాదం తగ్గుతుంది

- - జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారం రాథోడ్

**పాల్వంచ, ఏప్రిల్ 13, ప్రజాజ్యోతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నిర్వహించిన ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఔషధాధికారుల నెలవారీ సమీక్షా సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. తుకారం రాథోడ్ కీలక సూచనలు చేశారు. ఆలోచన సమావేశ మందిరంలో జరిగిన ఈ సమావేశంలో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనారోగ్య సమస్యలపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్లాస్టిక్ వాడకం మన దైనందిన జీవితంలో భాగమైపోయిందని, దాని వల్ల అనేక అనర్థాలు, ఆరోగ్య సమస్యలు ఏర్పడుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ వ్యాధులు పెరుగుతున్న నేపథ్యంలో ఆహార పదార్థాలు, త్రాగునీటి కోసం ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా నివారించాలని సూచించారు. నిత్యజీవితంలో ప్లాస్టిక్‌కు దూరంగా ఉండాలని, బయట ఆహారం తీసుకోవడాన్ని తగ్గించాలని సూచించారు. పునర్వినియోగ నూనెల వాడకం వల్ల క్యాన్సర్ వచ్చే అవకాశాలు అధికంగా ఉన్నాయని హెచ్చరించారు.ప్రతిరోజూ తగినంత నీరు త్రాగడం, శారీరక శ్రమ, వ్యాయామం, నడక, యోగా వంటి ఆరోగ్యకర అలవాట్లు అలవరుచుకోవాలని సూచించారు. జిల్లా గిరిజన ప్రాంతం కావడంతో పేద రోగులకు సమగ్ర వైద్య సేవలు అందించాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని తెలిపారు. అవసరమైన మందులు, రక్తపరీక్షలు అందుబాటులో ఉంచాలని ఆదేశించారు.సిబ్బంది సమయపాలన పాటిస్తూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు విధుల్లో ఉండాలని, నిర్లక్ష్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. క్యాన్సర్ నివారణకు హెచ్‌పీవీ టీకాపై ప్రజల్లో అవగాహన కల్పించి, అర్హులైన యుక్తవయసు బాలికలకు టీకా వేయించేందుకు ప్రోత్సహించాలని సూచించారు.జిల్లాను ఆరోగ్య సూచికల్లో ముందంజలో నిలపాలని, అందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా పనిచేయాలని పిలుపునిచ్చారు. ఆసుపత్రులకు వచ్చే ప్రజలతో సిబ్బంది సత్ప్రవర్తనతో వ్యవహరించాలని సూచించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, ఉప కేంద్రాలు, బస్తీ దవాఖానలు, పట్టణ ఆరోగ్య కేంద్రాలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, సమయపాలనలో లోపం ఉన్నా శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.పాముకాటు, కుక్కకాటు మందులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఎండాకాలంలో వడదెబ్బ నివారణకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని సూచించారు. సికిల్ సెల్, థలసేమియా, హెచ్ఐవీ వంటి వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. క్షయవ్యాధి అనుమానితుల నుంచి కఫ నమూనాలు సేకరించాలని, రక్తపోటు, మధుమేహ మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు.ఇంటిగ్రేటెడ్ హెల్త్ ఇన్ఫర్మేషన్ పోర్టల్‌లో ప్రగతి నివేదికలను ప్రతిరోజూ నమోదు చేయాలని ఆదేశించారు. ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి సాయి కల్యాణ్, మలేరియా ప్రోగ్రాం అధికారి రాందాస్, సమగ్ర ఆరోగ్య అధికారి సౌమ్యా, ఆరోగ్య విద్యాధికారి రాంప్రసాద్, ఆయుర్వేద వైద్య అధికారి కుమారస్వామి, ప్రయోగశాల సాంకేతిక నిపుణులు, ఔషధాధికారులు పాల్గొన్నారు.

# వరుడి ఇంటి విన్నపం...

# వధువు ఇంటి నిర్ణయం




**కాలం మారితే కట్టుబాట్లు మారతాయి అంటారు... కానీ ఇక్కడ కాలమే కాదు, సమాజపు దృక్పథం సాక్షాత్తుగా తలకిందులైన దృశ్యం కనిపిస్తోంది. ఒకప్పుడు ఆడపిల్ల పుట్టిందంటే బాధపడిన కుటుంబాలే ఇప్పుడు ఆడపిల్లే అదృష్టమని భావించే స్థితి నెలకొంది. వరకట్నం భారంతో వంగిపోయిన వధువు కుటుంబాల స్థానంలో... ఇప్పుడు వరుడి కుటుంబాలే ముందుకొచ్చి "అమ్మాయి దొరికితే చాలు" అని వేడుకునే పరిస్థితి రావడం సమాజంలో సంభవిస్తున్న మౌలిక మార్పుకు ప్రతీకగా నిలుస్తోంది. ఈ నేపథ్యంలో వరకట్నం నుంచి వధువు ప్రాధాన్యం వరకు మారిన పెళ్లి సమీకరణాలపై ప్రజాజ్యోతి ప్రత్యేక కథనం...**

**మారుతున్న సమాజ ధోరణులు**

- అమ్మాయిల కొరతతో తిరుగుతున్న పెళ్లి వ్యవస్థ
- అమ్మాయి దొరికితే చాలు అన్న అబ్బాయిల కుటుంబాలు
- కులం–మతం కట్టుబాట్లు కరిగిపోతున్న పరిస్థితి
- వరుడి ఎంపికలో కఠిన ప్రమాణాలు పెంచుతున్న వధువు కుటుంబాలు
- భ్రూణహత్యలే అసమానతలకు మూలం అనే ఆందోళన

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ఏప్రిల్ 13, ప్రజా జ్యోతి :** గతంలో పెళ్లి అనేది వరుడి కుటుంబం చేతుల్లోనే ఉండే వ్యవస్థ. కులం, మతం, ఆర్థిక స్థితి, కట్నం... ఇలా అనేక ప్రమాణాలతో వధువును ఎంపిక చేసుకునే విధానం కొనసాగింది. కానీ ఇప్పుడు ఆ దృశ్యం పూర్తిగా మారిపోయింది. అమ్మాయిల సంఖ్య తగ్గిపోవడంతో అబ్బాయిల కుటుంబాలు "ఎవరైనా సరే... మంచి అమ్మాయి దొరికితే చాలు" అనే స్థాయికి చేరుకున్నాయి. కొన్నిచోట్ల "మేమే ఖర్చులు భరిస్తాం... మీరు ఆలోచించాల్సిన అవసరం లేదు" అంటూ వరుడి కుటుంబాలే ముందుకు రావడం విశేషం.

### ››› కులం, మతం కట్టుబాట్లకు బ్రేక్. ...

ఒకప్పుడు పెళ్లిళ్లలో కులం, మతం ప్రధాన ప్రమాణాలుగా నిలిచాయి. కానీ ప్రస్తుతం అమ్మాయిల కొరత కారణంగా ఆ కట్టుబాట్లు క్రమంగా కరిగిపోతున్నాయి. వివాహ ప్రకటనలలో "కులం–మతం సంబంధం లేదు" అనే మాటలు విస్తృతంగా వినిపిస్తున్నాయి. ఇది సామాజిక నిర్మాణంల సంభవిస్తున్న గణనీయ మార్పుకు సంకేతం. ఇక వధువు కుటుంబాల వైఖరిలో కూడా స్పష్టమైన మార్పు కనిపిస్తోంది. గతంలో కట్నం భారంతో ఒత్తిడికి గురైన కుటుంబాలు ఇప్పుడు వరుడి గుణగణాలు, ఉద్యోగం, ఆదాయం, జీవన విధానం వంటి అంశాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నాయి. నగర జీవితం, స్థిరమైన ఉపాధి, భవిష్యత్ భద్రత వంటి అంశాలను ప్రామాణికంగా తీసుకుని నిర్ణయాలు తీసుకుంటున్నారు. "నువ్వు కాకపోతే మరొకరు" అనే ధోరణి పెరగడం కూడా ఈ మార్పుకు ప్రతిబింబం.



### ››› వ్యవసాయ కుటుంబాలకు సవాళ్లు....

వ్యవసాయమే ఆధారం... భూమే బలం... కానీ పెళ్లి విషయానికి వస్తే ఆ బలం ఇప్పుడు బలహీనంగా మారుతోంది. ఒకప్పుడు "ఎన్ని ఎకరాలు ఉన్నాయి?" అన్న ప్రశ్నే ప్రధానంగా ఉండేది. ఇప్పుడు మాత్రం "ఎక్కడ జాబ్?" అన్నదే నిర్ణయాత్మకంగా మారింది. భూమి ఉన్నా, పంటలు పండించినా... నెలకు వచ్చే స్థిరమైన ఆదాయం లేకపోతే వరుడి విలువ తగ్గిపోతున్న వాస్తవం గ్రామాల్లో స్పష్టంగా కనిపిస్తోంది. నగర జీవితం, ఉద్యోగ భద్రత, స్థిరమైన జీతంఇవే ఇప్పుడు పెళ్లి సంబంధాల్లో కీలక ప్రమాణాలుగా మారాయి. దీంతో వ్యవసాయాన్ని వృత్తిగా కొనసాగిస్తున్న యువకులు పెళ్లి విషయంలో వెనుకబడుతున్నారు. గ్రామీణ జీవన విధానం కంటే పట్టణ జీవనమే మెరుగన్న భావన పెరగడంతో... "భూమి ఉంది" అన్న మాటకన్నా "జాబ్ ఉంది" అన్న మాటకే విలువ పెరుగుతోంది.

### ››› భ్రూణహత్యలే మూలం ....

ఈరోజు కనిపిస్తున్న పెళ్లి వ్యవస్థ మార్పుల వెనుక ఒక కఠిన నిజం దాగి ఉంది... అది భ్రూణహత్యలు. ఒకప్పుడు ఆడపిల్లను భారంగా భావించి గర్భంలోనే తొలగించిన అనేక ఘటనలు, ఇప్పుడు సమాజానికి ప్రతిఫలంగా తిరిగి ఎదురవుతున్నాయి. లింగ నిష్పత్తి దెబ్బతినడం వల్ల ఆడ–మగ అసమానతలు పెరిగి, అదే పెళ్లి వ్యవస్థను పూర్తిగా మార్చే స్థాయికి తీసుకువచ్చింది. ఇప్పటికీ కొన్ని ప్రాంతాల్లో భ్రూణహత్యలు కొనసాగుతుండటం మరింత ఆందోళన కలిగిస్తోంది. సమాజంలో ఆలోచనల్లో మార్పు వచ్చినట్లు కనిపించినా, ఆచరణలో మాత్రం పూర్తి అవగాహన రాకపోవడం స్పష్టమవుతోంది. ఆడపిల్ల విలువ పెరిగినట్లు మాట్లాడుతున్న సమాజమే, కొన్ని చోట్ల ఇంకా పాత దారినే నడవడం విరుద్ధ ధోరణిగా కనిపిస్తోంది.

### ››› నాటి అన్యాయాలకు నేటి ప్రతిఫలం....

ప్రస్తుతం చోటుచేసుకుంటున్న మార్పులు ఒకవైపు ఆడపిల్లల ప్రాధాన్యం పెరిగిందనే సంకేతమైతే, మరోవైపు గతంలో జరిగిన అన్యాయాలకు వచ్చిన ప్రతిఫలంగా కూడా చూడాల్సిన అవసరం ఉంది. లింగ అసమానతలు, భ్రూణహత్యలు వంటి సమస్యలను సమూలంగా అరికట్టకపోతే భవిష్యత్తులో మరింత తీవ్రమైన సామాజిక అసమతుల్యతలు తలెత్తే ప్రమాదం ఉందని విశ్లేషకులు హెచ్చరిస్తున్నారు. మొత్తంగా, వరకట్నం నుంచి వధువు ప్రాధాన్యం వరకు వచ్చిన ఈ మార్పు సమాజానికి ఒక హెచ్చరిక. ఆడపిల్లను భారంగా కాకుండా సమాన హక్కులున్న వ్యక్తిగా చూడగలిగితేనే నిజమైన సమతుల్యం సాధ్యమవుతుంది. లేదంటే ఈ మార్పులు తాత్కాలికమే అవుతాయని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# కాంకేర్ లో ఎన్ కౌంటర్

- ఒక మహిళా మావోయిస్టు మృతి
- మృతి చెందిన మావోయిస్టుపై ఐదు లక్షల రివార్డు
- ఆయుధాలు, సామాగ్రి స్వాధీనం

**చర్ల, ఏప్రిల్ 13: (ప్రజా జ్యోతి ):** ఛత్తీస్ గఢ్ రాష్ట్రంలోని కాంకేర్ జిల్లాలో సోమవారం భద్రతా దళాలకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మహిళా మావోయిస్టు మృతి చెందింది . ఛోటేబెథియా–పార్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సరిహద్దు ప్రాంతంలో ఉన్న మచ్ పల్లి–ఆరామ్ ఝోరా–హిదుర్ అడవులలో మావోయిస్టులు ఉన్నారనే సమాచారం మేరకు గాలింపు చర్యలు చేపట్టామని పోలీస్ సూపరింటెండెంట్ నిఖిల్ రాఖేచా తెలిపారు. ఈ క్రమంలో మచ్ పల్లి ప్రాంతంలో భద్రతా దళాలకు, మావోయిస్టులకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి అని ఎదురుకాల్పుల అనంతరం ఆ ప్రాంతంలో జరిపిన గాలింపులో భద్రతా దళాలు ఒక మహిళా మావోయిస్టు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నాయి అని అన్నారు. మృతి చెందిన మావోయిస్టు పై ఐదు లక్షల రివార్డు ఉన్నదని అన్నారు .పోలీసుల ప్రకారం మృతి చెందిన మావోయిస్టు కార్యకర్తను ఏసీఎం రూపీగా గుర్తించారు. ఆమె ఆ సంస్థలో కమాండర్ స్థాయి చురుకైన సభ్యురాలిగా ఉంటూ చాలా కాలంగా బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలలో పాల్గొన్నారు అని అన్నారు.నివేదికల ప్రకారం మావోయిస్టు రూపి, డీకేఎస్ జెడ్ సీ సభ్యుడు విజయ్ రెడ్డి భార్య. 2025లో మాన్ పూర్–మొహ్లా జిల్లాలో జరిగిన ఒక ఎన్ కౌంటర్ లో విజయ్ రెడ్డి మరణించగా అక్కడే అతని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. బస్తర్ ప్రాంతంలో చురుకుగా ఉన్న చివరి తెలుగు మావోయిస్టు కార్యకర్తలలో రూపి ఒకరని సంస్థ కార్యకలాపాలలో ఆమె కీలక పాత్ర పోషించారని పోలీసులు చెబుతున్నారు. ఎన్ కౌంటర్ జరిగిన ప్రదేశంలో గాలింపు జరిపినప్పుడు ఆ మహిళా మావోయిస్టు మృతదేహం సమీపంలో భద్రతా దళాలు ఒక పిస్టల్, మందుగుండు సామగ్రి ఇతర సామాగ్రిని స్వాధీనం చేసుకున్నాయి. ఇతర మావోయిస్టుల ఉనికిని గుర్తించడానికి భద్రతా దళాలు ఆ ప్రాంతమంతటా విస్తృత గాలింపు చర్యలు చేపట్టాయి. సమాచారం అందుకున్న వెంటనే భద్రతా దళాల బృందం ఆ ప్రాంతాన్ని చుట్టుముట్టి వ్యూహాత్మక గాలింపు ప్రారంభించిందని పోలీసు అధికారులు తెలిపారు. ఎన్ కౌంటర్ సమయంలో మావోయిస్టులు కాల్పులు జరపడంతో భద్రతా దళాలు ఎదురు కాల్పులు జరిపాయి.ఎన్ కౌంటర్ అనంతరం మావోయిస్టులు అడవుల్లోకి పారిపోగా ఒక మహిళా మావోయిస్టు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ ప్రాంతంలో పరిస్థితి ఇప్పుడు అదుపులో ఉందని అయితే ముందుజాగ్రత్త చర్యగా గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయని సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ నిఖిల్ రాఖేచా తెలిపారు. మావోయిస్టు ల కదలికలను పర్యవేక్షించేందుకు చుట్టుపక్కల అడవుల్లో అదనపు బలగాలను మోహరించారు అని అన్నారు .ఈ ఘటన అనంతరం బస్తర్ రేంజ్ ఇన్ స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ సుందర్ రాజ్ పట్టలింగం కూడా ఒక ప్రకటన విడుదల చేశారు. లొంగిపోయి పునరావాసం పొందాలని రాష్ట్రప్రభుత్వం మావోయిస్టులకు నిరంతరం విజ్ఞప్తి చేస్తోందని ఆయన తెలిపారు. గత కొన్ని నెలలుగా పెద్ద సంఖ్యలో మావోయిస్టు కార్యకర్తలు హింసను విడిచిపెట్టి జనజీవన స్రవంతిలో చేరారు అని రూపీ వంటి కొందరు కార్యకర్తలు లొంగిపోయే అవకాశాన్ని వినియోగించుకోకుండా హింసా మార్గంలోనే ఉండిపోయారని ఐజీపీ అన్నారు.దీని ఫలితమే ఇలాంటి సంఘటనల రూపంలో బయటపడుతోంది అని భద్రతా దళాల చర్య కేవలం ఆ ప్రాంతంలో శాంతిభద్రతలను కాపాడటం శాంతిని నెలకొల్పడం కోసమేనని ఆయన అన్నారు. మావోయిస్టు సంస్థతో సంబంధం ఉన్న ఇతర సభ్యులకు కూడా ఆయన విజ్ఞప్తి చేశారు వారికి ఇప్పుడు సమయం తక్కువగా ఉందని, వారు హింసను విడనాడి జనజీవన స్రవంతిలోకి తిరిగి రావాలని కోరారు. ప్రభుత్వ పునరావాస విధానం కింద, వారికి సురక్షితమైన, గౌరవప్రదమైన జీవితాన్ని గడిపేందుకు అవకాశం కల్పిస్తున్నామని ఆయన అన్నారు. ఎన్ కౌంటర్ తర్వాత చుట్టుపక్కల గ్రామాలలోని గ్రామస్థులను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపం కనిపిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని ఆదేశాలు జారీ చేశారు. బస్తర్ ప్రాంతంలో మావోయిస్టు కార్యకలాపాలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న పోరాటంలో ఈ ఎన్ కౌంటర్ ఒక ముఖ్యమైన భాగంగా పరిగణించబడుతోంది అని ఈ ప్రాంతాన్ని మావోయిస్టు ప్రభావం నుండి పూర్తిగా విముక్తి చేయడానికి నిరంతర గాలింపులు ఆపరేషన్లు కొనసాగుతాయని భద్రతా దళాలు చెబుతున్నాయి. ప్రస్తుతం మొత్తం ప్రాంతంలో పరిస్థితి అదుపులో ఉంది అని భద్రతా దళాలు అప్రమత్తంగా ఉంటూ ఆపరేషన్ ను కొనసాగిస్తున్నాయి అని అన్నారు .



